మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

## ఎన్నికల కమిషన్ నిబంధనలను తూ.చ తప్పకుండా పాటించాలి



జిల్లా స్థాయి ఎన్నికల మాస్టర్ ట్రైనింగ్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

**వనపర్తి టౌన్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :** ఎన్నికల సిబ్బంది ఎన్నికల కమిషన్ ఇచ్చిన నిబంధనలను తూ.చ తప్పకుండా పాటించాలనీ, ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ఎన్నికల సిబ్బందికి అనుమానాలు లేకుండా శిక్షణ ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ సన్నద్ధత లో భాగంగా సోమవారం ఉదయం ఐ.డి.ఒ.సి నేషనల్ ఇన్స్టిట్యూట్ సెంటర్ లో మండల స్థాయి మాస్టర్ ట్రైనర్ లకు జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించగా జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో ఎన్నికల కమిషన్ ఇచ్చిన నియమ నిబంధనలు తూ.చ తప్పకుండా పాటించాలని, పోలింగ్ సిబ్బంది తనకు తోచినట్లుగా వ్యవహరించడానికి వీలు లేదని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణ పై జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్ లు ఇచ్చే ఎన్నికల నిర్వహణ శిక్షణను బాగా అర్థం చేసుకొని మండల స్థాయిలో ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. అందువల్ల శిక్షణ ఏ స్థాయిలో ఉన్న ఎలాంటి అనుమానాలు లేకుండా అన్ని నివృత్తి చేసుకోవాలని సూచించారు. మాస్టర్ ట్రైనర్ శ్రీనివాస్ మండల ట్రైనర్లకు శిక్షణ ఇచ్చారు. అదేవిధంగా స్థానిక సంస్థల ఎన్నికలు బ్యాలెట్ పేపర్ల ద్వారా నిర్వహిస్తున్నందున బ్యాలెట్ బాక్సు ఏవిధంగా తెరవాలి, సీల్ ఏవిధంగా చేయాలి ఎన్నికల నిబంధనలు ఏ విధంగా ఉంటాయో ఫిజికల్ గా చూపించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, డి.పి. ఒ సురేష్, జడ్పి సీఈఓ యాదయ్య, మాస్టర్ ట్రైనర్ శ్రీనివాస్, మండల ట్రైనర్లు పాల్గొన్నారు.

### ప్రజావాణి ఫిర్యాదులను
## తక్షణమే పరిష్కరించాలి




ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్ సంతోష్

**గద్వాల, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్య తనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ బి.యం. సంతోష్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 41 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్లు లక్ష్మినారాయణ, నర్సింగరావు, ఆర్డీఓ శ్రీనివాసరావు లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## వనపర్తిలో..



ప్రజావాణి లో అర్జీలను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి టౌన్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :** ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులు, అర్జీలను వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి అదనపు కలెక్టర్ రెవెన్యూ జి.వెంకటేశ్వర్లు, ఆర్డీఓ సుబ్రహ్మణ్యంతో కలిసి హాజరై ప్రజల నుంచి అర్జీలు, వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలకు పరిష్కారం చూపే బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో 46 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు, అర్జీలను పరిశీలించి, సత్వర పరిష్కారం చూపేలా సంబంధిత శాఖల జిల్లా స్థాయి అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి, వెంటనే పరిష్కరించేలా తగు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. సీఎం, జిల్లా మంత్రి ప్రజావాణి నుంచి వచ్చిన, పెండింగ్ లో ఉన్న అర్జీలను సైతం వారంలో పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర, రాష్ట్ర పథకాలపై
## అవగాహన పెంచుకోవాలి : కలెక్టర్



అధికారుల సమవేశంలో పాల్గొన్న కలెక్టర్ సంతోష్

**గద్వాల, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై అధ్యయనం చేసి, అవగాహన పెంచుకోవాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అన్నారు. సోమవారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్ నందు ఎంసీఆర్ హెచ్ ఆర్ డి ఇనిస్టిట్యూట్ 139 వ స్థాయిడి శిక్షణ కార్యక్రమంలో భాగంగా జిల్లాకు విచ్చేసిన కేంద్ర సచివాలయ సేవల సెక్షన్ ఆఫీసర్ల 16 మంది అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జోగులాంబ గద్వాల జిల్లా భౌగోళిక పరిస్థితులు, నియోజకవర్గాలు, మండలాలు, జిల్లాలో అమలు అవుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు గురించి అధికారులకు అవగాహన కల్పించారు. ఈ శిక్షణా పర్యటన ద్వారా క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాల ప్రాముఖ్యత, అమలు తీరును అధ్యయనం చేసి, ప్రజల అవసరాలను అనుసరించి పాలసీ మార్పులు చేయడంతో పాటు, పథకాల అవగాహనను పెంచి అమలులో పారదర్శకతను మెరుగుపరిచేందుకు అధికారులు ప్రత్యక్ష పరిశీలనలు నిర్వహించాలని సూచించారు. శిక్షణకు వచ్చిన అధికారులంతా ఫిబ్రవరి 10వ తేదీ నుండి ఫిబ్రవరి 18వ తేదీ వరకు నిర్దేశించిన షెడ్యూల్‌కి అనుగుణంగా జిల్లాలో పనిచేయాలని సూచించారు. 16 మంది శిక్షణాధారుల కోసం 4 గ్రూపులు ఏర్పాటు చేసి, జిల్లా స్థాయిలో డిఆర్డిఓ, ఈడీ ఎస్సీ అధికారులు నోడల్ పాయింట్‌గా, మండల స్థాయిలో తహశీల్దార్లు, ఎంపీడీఓలు, పురపాలక స్థాయిలో మున్సిపల్ కమిషనర్ సమన్వయ బాధ్యతలు నిర్వర్తిస్తారని తెలిపారు. జిల్లాలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, మిషన్ భగీరథ, వన మహోత్సవం, చేయూత పింఛన్లు, ఇందిరమ్మ ఇల్లు, గృహలక్ష్మి, రైతు భరోసా, ఆయుష్మాన్ భారత్, నేషనల్ హెల్త్ మిషన్, స్వచ్ఛ భారత్, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, పోషణ అభియాన్, విశ్వకర్మ, హ్యాండ్ లూమ్, అమృత్ 2.0 వంటి తదితర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును వివరించారు. గ్రామ, మండల, పురపాలక స్థాయిలో పథకాల అమలు తీరును పరిశీలించి, వాటిపై అధ్యయనం చేసి, అమలులో ఉన్న సవాళ్లు, ప్రజలపై ప్రభావం, సమర్థత తదితర అంశాలను విశ్లేషించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేష్ బాబు, అడిషనల్ డిఆర్డీఓ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

### 100 % రుణమాఫీ అయినట్లు నిరూపిస్తే..
# రాజీనామా చేస్తా..

**సీఎం రేవంత్ రెడ్డికి**
**బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్**
**మహబూబ్‌నగర్ జిల్లా కోస్గి రైతు నిరసన దీక్ష**
**హాజరైన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా**
**మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు**



నాకు చర్ల రైతు నిరసన దీక్షలో మాట్లాడుతున్న కేటీఆర్

**మహబూబ్‌నగర్ బ్యూరో, మద్దూరు, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:** రైతు భరోసా కొడంగల్ నియోజకవర్గం ప్రజల సాక్షిగా ప్రారంభించి ఇంతవరకు ఏ ఒక్క రైతు కూడా రైతు భరోసా పడలేదని బి ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్ రెడ్డి తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి మళ్లీ పోటీ చేయాలని తిరిగి గెలిస్తే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని బి.ఆర్.ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. నారాయణపేట జిల్లా కోస్గి పట్టణ కేంద్రంలో సోమవారం కేటీఆర్ రైతు నిరసన దీక్షలో ప్రసంగించారు. కోస్గి పట్టణ కేంద్రంలో రేవంత్ రెడ్డి 4 పథకాలను ప్రారంభించి దానిలో ఒకటైన అమలు చేశారా అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో కల్లబొల్లి మాటలు చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి తీసుకువచ్చి రైతులను నిలువు దోపిడి చేశావని విమర్శించారు. రేవంత్ అల్లుడుకి లగచర్లలు భూములు అప్పగించాలని ఉద్దేశంతోనే రైతుల భూములు గుంజుకోవాలని ప్రయత్నం చేశారని ఆరోపించారు. రుణమాఫీ చేస్తానని చెప్పడమే కానీ ప్రభుత్వానికి దమ్ముందా.. ఉంటే రాష్ట్రంలో ఎక్కడనైనా వందకు వంద రుణమాఫీ చేసినట్లు చూపిస్తే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని కేటీఆర్ సవాల్ విసిరారు. మహిళలకు 2500 ఇస్తానని చెప్పి మోసం చేసి అధికారంలోకి వచ్చిన ఘనత నీదేనని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రభుత్వం మీ తాత జాగిరా నీ అయ్య జాగిరా రేవంత్ రెడ్డి దమ్ముంటే రాజీనామా చేసి కొడంగల్ నుంచి బరిలో దిగితే నీపైన పట్నం నరేందర్ రెడ్డి 50 వేల మెజార్టీతో గెలుపొందడం ఖాయమని కోస్గి సభలో ఈ సందర్భంగా ఆయన అన్నారు. లగచర్ల గిరిజన మహిళకు పుట్టిన బిడ్డకు భూమి నాయక్ అని పేరు నామకరణం చేశాడు. భూముల కోసం నిరంతరం ధర్నా చేసి జైలు కు వెళ్లి వచ్చిన జ్యోతి బిడ్డకు నామకరణం చేయడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో నారాయణపేట జిల్లా టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి, దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి, మక్తల్ మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, మహబూబ్‌నగర్ మాజీ ఎమ్మెల్యే మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి, నారాయణపేట జిల్లా మాజీ కోఆప్షన్ నెంబర్ సలీం, టిఆర్ఎస్ నాయకులు మాజీ కౌన్సిలర్లు మాజీ మున్సిపల్ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.



రైతు నిరసన దీక్షలో పాల్గొన్న కార్యకర్తలు

## ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

**పలు అభివృద్ధి పనులకు**
**భూమి పూజ ప్రారంభోత్సవాల్లో**
**అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ**



మామిళ్ళపల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ

**ఉప్పునుంతల, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :** తెలంగాణరాష్ట్రంలో సంక్షేమపథకాలను అందించడమే కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వ లక్ష్యమని అచ్చంపేట ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని మామిళ్ళపల్లి, మొల్గర గ్రామంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. మామిళ్ళపల్లి గ్రామంలో సిసిరోడ్లకు, గ్రామపంచాయతీ భవనానికి, లక్ష్మినరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో కార్యాలయ భవనాని భూమి పూజచేశారు. అదే విధంగా మొల్గర గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద రూ.20లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడు తూ రాష్ట్రంలో పేద ప్రజల సంక్షేమం కోసం ఆహాదిశలు కృషిచేస్తున్న నల్లమల్ల ముద్దుబిడ్డ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి హయంలో గ్రామాలలో మోలిక వసతులు కల్పించ డమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను ప్రజలు సద్వినియోగం చేసు కోవాలని, జీర్ణించుకోలేని ప్రతిపక్షాలు ప్రజలను తప్పు దారి పట్టించే ప్రయత్నం చేసినప్పటికీ ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, గతంలో పరిపా లించిన పాలకులు 10సంవత్సరాలలో ప్రజలకు ఒరగబెట్టింది ఏమి లేదన్నారు.గతంలో ప్రజలు స్వేచ్ఛగా లేని పరిస్థితిలో ఉన్నారని, దాన్ని మీరు గమనించి మీరు చేసిన అరాచకాలు గుర్తు చేసుకోవాలన్నారు. మండలంలో బడుగు బలహీ న వర్గాల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తామని, ఎక్కడ ఎలాంటి సందేహాలు లేకుండా అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే గుర్తు చేశారు. వచ్చే నెలలో జరగబోయే లక్ష్మినర సింహస్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసేందుకు తమ వంతు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. మామిళ్ళపల్లి ఆలయ అర్చకులు అచ్చంపేట ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణను పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ, పంచాయతీరాజ్ డిప్యూటీ డిఈ చంద్రకళ, ఎంపిడిఓ మో హన్‌లాల్, డివిజనల్ పంచాయతీ అధికారి వెంకట్‌దాస్ , మండల పంచాయతీ అధికారి నారాయణ, పంచాయతీరాజు ఏఈ మహేష్, పాటు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, నాయకులు తిప్పర్తి నరసింహారెడ్డి, మాజీ జడ్పీటీసీ అనంత ప్రతాప్‌రెడ్డి, మామిళ్ళపల్లి ఆలయ కమిటీ చైర్మన్ నర్సింహారావు, మాజీ ఎంపీటీసీ రామలక్ష్మమ్మ, బీసీసెల్ మండలనాయకులు మడ్డితిరుపతయ్య గౌడ్, గోవర్ధన్‌రెడ్డి, మోహన్‌లాల్, సూరం ప్రశాంత్‌రెడ్డి, శ్రీ ఉమామహేశ్వర –మిగతా4లో..

## పరీక్ష పే చర్చలో డిఇఓ



ప్రధాని ప్రసంగాన్ని వీక్షిస్తున్న డీఈవో, విద్యార్థులు

**మహబూబ్‌నగర్‌బ్యూరో, ఫిబ్రవరి10 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని షాషాబ్‌గుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షలు రాయబోతున్న విద్యార్థుల కోసం కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన పరీక్ష పే చర్చ అనే కార్యక్రమం ప్రసారం చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విద్యార్థులతో పరీక్షలు వాటిలో విద్యార్థులు పడుతున్న ఒత్తిడి ఎలా అధిగమించాలి అదేవిధంగా జీవితంలో ఏ విధంగా సక్సెస్ అవ్వాలి అనే అంశాలపై విద్యార్థులతో ముచ్చటించారు. కార్యక్రమాన్ని విద్యార్థులతో కలిసి డీఈవో ప్రవీణ్ కుమార్, ఏఎమ్ఓ దుంకుడు శ్రీనివాస్ వీక్షించారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులతో డిఇఓ వారికి ఏవిధంగా పదోతరగతి పరీక్షలను రాయాలి అదేవిధంగా జీతంలో ఏవిధంగా సక్సెస్ అవ్వాలి అనే విషయంపై అవగాహన కల్పించారు. అదేవిధంగా విద్యార్థులకు ఈసారి అత్యధిక మార్కులు తెచ్చుకుని జిల్లాకు మంచి ర్యాంకు తేవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### స్త్రీ నిధి రుణాలను
## సద్వినియోగం చేసుకోవాలి

**మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేంద్ర బోయి సూచన**




చేపల విక్రయ వాహనాన్ని అందజేస్తున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్‌బ్యూరో, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:** ఇందిరా మహిళా శక్తి ద్వారా సబ్సిడీపై స్త్రీ నిధి బ్యాంక్ రుణం ద్వారా అందించిన సంచార చేపల విక్రయవాహనం సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజయేంద్ర బోయి సూచించారు. ఇందిరా మహిళా శక్తి పథకం క్రింద జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, మత్స్య శాఖ ద్వారా ఐకెపి 60 శాతం సబ్సిడీతో 40 శాతం స్త్రీనిధి రుణం ఎస్‌బిఐ బ్యాంక్ సంచార – మిగతా4లో..

## ముడా నిధులతో అభివృద్ధి చేస్తాం

**ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**
**దివిటిపల్లి డబుల్ బెడ్ రూం కాలనీలో ఆంజనేయ స్వామి**
**విగ్రహ ప్రతిష్ట మహోత్సవం**

**మహబూబ్‌నగర్‌బ్యూరో, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరూ భక్తితో ఆంజనేయ స్వామిని సేవించి తరించాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆకాంక్షించారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గంలోని దివిటిపల్లి డబుల్ బెడ్రూం కాలనీలో జరిగిన శ్రీశ్రీశ్రీ జిట్టా ఆంజనేయస్వామి, నవగ్రహ దేవతలను, ధ్వజ స్థంభం, బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామానికి రక్షణగా నిలబడే ఆంజనేయ స్వామి వారిని అలాగే గ్రామాన్ని – మిగతా4లో..



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

# ఇండ్ల స్థలాల కోసం తహశీల్దార్ కార్యాలయం ముట్టడి ఉద్రిక్తత

- సిపిఎం, పోలీసుల మధ్య తోపులాట
- తహశీల్దార్ కార్యాలయం చుట్టు భారీ కేడ్లు ఏర్పాటు
- రోడ్డుపై 6గంటలు సిపిఎం ధర్నా
- కార్యాలయం ఆరుబయటే వంటావార్పు
- ఎమ్మెల్యే, హామీతో ఆందోళన విరమణ



సిపిఎం, పోలీసుల మధ్య తోపులాట



సిపిఎం ధర్నాలో మాట్లాడుతున్న మక్తల్ ఎమ్మెల్యే, డాక్టర్ వాకిటి శ్రీహరి

**అమరచింత, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :** అమరచింత మున్సిపల్ కేంద్రంలోని దుంపాయకుంటలో పట్టాలు పొందిన లబ్ధిదారులకు స్థలాలు చూపాలని డిమాండ్ చేస్తూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలో రెండు రోజుల పాటు రిలే నిరాహార దీక్షలు చేపట్టిన సందర్భంగా అధికారులు స్పందించకుంటే సోమవారం అమరచింత తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించడంతో పోలీసులు ముందు జాగ్రత్తగా తహశీల్దార్ కార్యాలయం చుట్టూ భారీ కేడ్లు ఏర్పాటు చేశారు. సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో బస్టాండ్ నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహిస్తూ తహశీల్దార్ కార్యాలయం లోపలికి వెళుతుండగా పోలీసులు సిపిఎం శ్రేణులను అడ్డుకోవడంతో ఇద్దరి మధ్య తోపులాట చోటు చేసుకుంది. ఆందోళనకారులతో ఆత్మకూరు సిఐ శివకుమార్ మాట్లాడిన ఫలించకపోవడంతో ఆందోళనకారులు జిల్లా కలెక్టర్, ఆర్డీఓ, ఎమ్మెల్యే వచ్చేవరకు ఆందోళన చేస్తామని చెప్పడంతో సీఐ పలుమార్లు సిపిఎం నాయకులతో మాట్లాడారు. లబ్ధిదారులతో కలిసి సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం రోడ్డుపై 6 గంటలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు ఎండి జబ్బర్, ఎండి మహమూద్, జిఎస్ గోపి, బి వెంకటేష్, అజయ్, ఆర్ఎన్ రమేష్, ఇల్లు లేని పేదలకు గత ప్రభుత్వం 1997లో పట్టాలిచ్చిన ఇప్పటివరకు అధికారులు స్థలాలు చూపడం లేదని అనేకమార్లు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో కలెక్టర్, ఆర్డిఓ, ఎమ్మెల్యే, తహశీల్దార్ అధికారులకు వినతి పత్రాలు ఇచ్చిన పట్టించుకోవడం లేదని వారన్నారు. మక్తల్ ఎమ్మెల్యే ఎన్నికలలో దుంపాయకుంట లో పట్టాలు పొందిన లబ్ధిదారులకు స్థలాలిస్తాని హామీ ఇచ్చిన ఇప్పటివరకు అమలు చేయడం లేదని వారన్నారు. కలెక్టర్, ఎమ్మెల్యే, ఆర్డీఓ వచ్చి సమస్య పరిష్కారం చేసేదాకా ఆందోళన చేస్తామని ఆందోళనకారులు రోడ్డుపై కేటాయించారు. అలాగే రోడ్డుపైనే ఆందోళనకారులు వంటావార్పు చేపట్టారు. ఎమ్మెల్యే, డాక్టర్ వాకిటి శ్రీహరి ఆందోళన చేస్తున్న సిపిఎం పార్టీ ధర్నా చౌక్ కు చేరుకొని సిపిఎం పార్టీ అనేకమార్లు పేదలకు ఇండ్లు ఇవ్వాలని నా దృష్టికి తెచ్చారని పేదలకు సంబంధించిన ఇండ్ల సమస్యను జిల్లా కలెక్టర్ తో మాట్లాడి వారంలోగా పేదలకు న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో పాటు దుంపాయకుంటలో ముళ్ళకంపను తొలగించాలని అధికారులకు ఆదేశించారు. అలాగే నిజమైన అర్హులకు అఖిలపక్షం ఏర్పాటు చేసి ఇవ్వాలని ఆయన అధికారుల కు చెప్పారు. ఎమ్మెల్యే ఆందోళన కారులకు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. సిపిఎం పార్టీ చేపట్టిన తహశీల్దార్ ముట్టడి కార్యక్రమానికి అమరచింత ఎస్సై, ఆత్మకూర్ ఎస్సై, మదనాపురం ఎస్సై ఆధ్వర్యంలో 50 మంది పోలీసులను భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు తో పాటు లబ్ధిదారులు భారీగా పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న గణితావధానం

**విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, గణితావధాని డా.అనంత**

**పెబ్బేరు, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :** పెబ్బేరు మండలం కంచరావు పల్లి జడ్పీ హై స్కూల్‌లో చేసిన గణితావధానం అందరినీ ఆకట్టుకుంది. కళ్ళకు గంతలు కట్టుకొని విద్యార్థులు చెప్పిన అరవై పేర్లను వరుస క్రమంలో, తిరోగమనంలో చెప్పడం అలాగే పేరు చెబితే ఆ పేరు వరుస సంఖ్య, వరుస సంఖ్య చెబితే దాని పేరును తడబాటు లేకుండా చెప్పడం అందరినీ ఆశ్చర్యచకితులను చేసింది. అంతే కాక మాయా గణితంలో భాగంగా కొన్ని అంకెలను చెప్పించి దాని జవాబు ముందే చెప్పడం విద్యార్థులను బాగా ఆకర్షించింది. ఈ సందర్భంగా డా.ఆనంతప్ప మాట్లాడుతూ సాధన చేయడం వల్ల ఇది అందరికీ సాధ్యమని వివ రించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు ఆయనను ఘనంగా శాలువా కప్పి సన్మానించారు. ఈ నాటి కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కే.సరస్వతి, ఉపాధ్యాయులు శ్రీదేవి, నారాయణ రెడ్డి, వెంకటేశ్వర్లు, రాజు, రాజేష్ బాబు, అనురాధ, సాయిరేణు, కృష్ణవేణి, ఫాతిమా, శైలజ, చైతన్య, చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



గణిత అవధానిని సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

## విద్యార్థికి ప్రధాని మోదీ ప్రశంస పత్రం

**వనపర్తిటౌన్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :** వనపర్తి పట్టణంలోని చాణక్య హై స్కూల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థి బి.ప్రణయ్ కుమార్‌కు భారత ప్రధాని నరేంద్ర మోడీ నుండి ప్రశంసా పత్రం పంపించడం జరిగిందని స్కూల్ ప్రిన్సిపాల్ సాజు పాల్ ఒక ప్రకటనలో తెలిపారు. గుజరాత్ రాష్ట్రంలోని వడ్ నగర్‌లో గత సంవత్సరం దసరా సెలవులలో ప్రేరణ అనే వ్యాసరచన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దాదాపుగా 600 మంది విద్యార్థులు పాల్గొని శిక్షణ పొందారు. ప్రేరణ వ్యాసరచన శిక్షణకు వనపర్తి జిల్లా నుంచి వెళ్లిన ప్రణయ్ కుమార్‌కు భారత ప్రధాని నరేంద్ర మోడీ నుండి ప్రశంసా పత్రం రావడంతో చాణక్య హై స్కూల్ ప్రిన్సిపల్, తోటి విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తూ విద్యార్థికి శుభాకాంక్షలు తెలియజేశారు.



ప్రశంసా పత్రం అందుకుంటున్న విద్యార్థి

## 10వ తరగతి విద్యార్థులను పర్యవేక్షిస్తున్న ఉపాధ్యాయులు

**పెబ్బేరు, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :** పెబ్బేరు మండలం వైశాఖపూర్ గ్రామంలో జిల్లా పరిషత్ హైస్కూల్‌కు సంబంధించిన పదో తరగతి విద్యార్థులు ఎగ్జామ్స్ త్వరలో ఉన్నందున ఇప్పటినుంచి మంచిగా చదివి మంచి ఫలితాలను పొందాలని విద్యార్థులు చదువుతున్నారా లేదా అని వాళ్ళ ఇంటి దగ్గరికి స్వయంగా ఉపాధ్యాయులు వెళ్లి పర్యవేక్షించారు. వారి తల్లిదండ్రులకు దగ్గర ఉండి చదివించాలని వారికి సూచనలు ఇచ్చారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్ ఉపాధ్యాయులు విజయ్ కుమార్, బి విజయ్ పాల్గొన్నారు.



విద్యార్థులను పర్యవేక్షిస్తున్న ఉపాధ్యాయ బృందం

## మహిమాన్విత ఆలయం రామగిరి దేవాలయం

**- కన్నుల పండువగా సీతారామచంద్రస్వామి కళ్యాణం.. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి**

**కల్వకుర్తి, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:** రఘుపతిపేట శ్రీ సీతారామ దేవాలయం మహిమాన్వితమని ఎ మ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కల్వకుర్తి మండలంలోని రామగిరి శ్రీ సీతారామచం ద్రస్వామి దేవాలయంలో సోమవారం నిర్వహించిన కళ్యాణ మహోత్సవంలో స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి పాల్గొన్నారు. పలువురు నాయకులతో కలిసి దేవాలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే సీతారామచంద్ర కళ్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా తిలకించారు. అనంతరం దేవాలయ నిర్వాహకులు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని ఘనంగా సన్మానించారు. అంతకుముందు ఎమ్మెల్యే స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంతో పవిత్రమైన రామగిరి సీతారమచంద్రస్వామి దేవాలయంలో కళ్యాణం మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. కళ్యాణోత్సవంలో తెలంగాణ పొల్యూషన్ బోర్డు మెంబర్ ఠాగూర్ బాలాజీ సింగ్, ఆయన వెంట మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, మాజీ జెడ్పిటిసి అశోక్ రెడ్డి, పలువురు పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



కళ్యాణోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

## భట్టుపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల పరిశీలనలో పాల్గొన్న ఎమ్మార్వో,ఎంపిడీఓ

**భూత్పూర్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త :** భూత్పూర్ మండలం భట్టుపల్లి గ్రామంలో ఇందిరమ్మఇళ్లను భూత్పూర్ తహసిల్దార్ జయలక్ష్మి, ఎంపిడీఓ ప్రభాకర్‌లు సోమవారం పరిశీలించారు. గ్రామానికి చెందిన నిరుపేదలు ఇందిరమ్మ ఇళ్ల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన ప్రజపాలనలో దరఖాస్తు చేసుకోగా, దరఖాస్తుల ఆధారంగా వాటిని స్వయంగా పరిశీలిచేందుకు తహసిల్దార్ జయలక్ష్మి, ఎంపిడీఓ ప్రభాకర్ భట్టుపల్లి గ్రామానికి చేరుకునిలబ్ధిదారుల జాబితాను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన భూత్పూర్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రేకుల పాటి భూపతిరెడ్డి ఇతర నాయకులు రఘుపతిరెడ్డి ఇతర గ్రామస్తులు పాల్గొన్నారు.



జాబితాను పరిశీలిస్తున్న ఎమ్మార్వో,ఎంపిడీఓ తదితరులు

## ఎల్లికట్టని ఎస్సీ రిజర్వుడుగా కేటాయించాలి

**ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేసిన గ్రామస్తులు**

**కల్వకుర్తి, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:** గ్రామ పంచాయతీలు ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు ఎల్లికట్ట గ్రామపంచాయతీ ఒక్కసారి కూడా ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ లభించలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఎల్లికట్ట గ్రామపంచాయతీని ఎస్సీ ఎస్టీలకు కేటాయించాలని కోరుతూ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. గ్రామ ఓటర్లలో ఎస్సీ, ఎస్టీ ఓటర్ల 597 మంది ఉన్నారని వారు పేర్కొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామస్తుల విన్నపాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్తానని పేర్కొన్నారు. ఎమ్మెల్యేకు వినతి పత్రం అందించి న వారిలో కేశవులు, బాలకృష్ణ, రవి, శ్రీను, కృష్ణయ్య, శేఖర్, తిరుపతయ్య, చిన్నయ్య తదితరులు ఉన్నారు.

రైతులు మినుములు విత్తనాలకు దరఖాస్తు చేసుకోండి

## మండల వ్యవసాయాధికారిగా అనిల్

**లింగాల, ఫిబ్రవరి10 ప్రభాతవార్త:** మినుములు విత్తనాలు కావాల్సిన రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి అనిల్ అన్నారు. సోమవారం ఈ సందర్భంగా జాతీయ ఆహార భద్రత పథకం కింద లింగాల మండల కేంద్రంలోని రైతు వేదికలో మినుములు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మినుములు ఎల్‌బిజి 787 వెరైటి రకం విత్తనాలు కావాల్సిన రైతులు దరఖాస్తు ఫారంతో పాటు పట్టాదారు పాసు పుస్తకం జిరాక్స్‌లను అందజేసి మినుములు విత్తనాలు తీసుకోవాలని ఆయన కోరారు. మండలంలోని రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## సీఎంఆర్ఎఫ్ తో పేదలకు భరోసా..

**మక్తల్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :** అనారోగ్యానికి గురై ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదలకు సీఎంఆర్ఎఫ్ తో భరోసా కల్పిస్తున్నామని, ఈ సహాయాన్ని సద్వినియోగం చేసుకొని పూర్తి ఆరోగ్యవంతులుగా మారాలని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గణేష్ కుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాతింటి విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. మక్తల్ మండలంలోని పారేవులకు చెందిన మాల వెంకటప్ప ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురై హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేయించుకున్నారు. ఈ విషయమై స్థానిక ఎమ్మెల్యే డా.వాకిటి శ్రీహరి దృష్టికి తీసుకురాగా, ఆయన స్పందించి సీఎంఆర్ఎఫ్ కు సిఫారసు చేశారు. ఈ మేరకు బాధితుడికి రూ.75వేల ఆర్థిక సహాయం మంజూరు కాగా, సోమవారం సంబంధిత చెక్కును బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో ఆనంద్ గౌడ్, ఫయాజ్, కల్లూరి గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వెంకటేశ్వర స్వామి కళ్యాణం

**పట్టు వస్త్రాలు సమర్పించిన మాజీ ఎమ్మెల్యే రావుల దంపతులు**

**కొత్తకోట, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :** కొత్తకోట మండలం కానాయపల్లి గ్రామ సరిహద్దులో గల వెంకటగిరి క్షేత్రంలోని స్వయంభూ శ్రీ శ్రీ శ్రీ భూ లక్ష్మి వెంకటేశ్వర స్వామి కొలువై ఉన్న వెంకటగిరి క్షేత్రం దేవాలయం బ్రహ్మోత్సవ కళ్యాణ మహోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి శ్రీ భూ లక్ష్మి వెంకటేశ్వర స్వామి కళ్యాణానికి ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు మాజీ పార్లమెంట్ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్ రెడ్డి, రావుల వరలక్ష్మి దంపతులు సమర్పించారు. ప్రతి ఏట కళ్యాణనికి రావుల చంద్రశేఖర్ రెడ్డి కుటుంబం అనవాయితీగా పట్టు వస్త్రాలు, ముత్యాల తాళంబ్రాలు అందించేవారు. ఈ కళ్యాణంలో అలంపూర్ మాజీ ఎమ్మెల్యే రావుల రవీంద్రనాథ్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు. వేద మంత్రాలతో, స్వామివారి కళ్యాణం కన్నుల పండగగా జరిగింది. వందలాది భక్తులు కళ్యాణంలో పాల్గొని స్వామి వారి అశీస్సులు పొందుకున్నారు. ముందుగా పట్టు వస్త్రాలు, ముత్యాల తాళంబ్రాలు మాజీ ఎమ్మెల్యే రావుల నివాసం నుండి ఊరేగింపుగా బాజ భజంత్రితో ఘనంగా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం కళ్యాణంలో కోలాటలు, సంస్కృతిక కార్యక్రమాలు చేపట్టిన కానాయపల్లి గ్రామ చిన్నారులకు ఒక్కో గ్రూప్ చొప్పున 3 గ్రూప్‌లకు మాజీ ఎమ్మెల్యే రావుల ఆర్థిక సాయం చేశారు. అనంతరం కళ్యాణం జరిపించిన వేద పండితులను, నాయి బ్రాహ్మణ సోదరులను శాలువాతో సత్కరించి అశీసులు తీసుకున్నారు. అదేవిధంగా కళ్యాణానికి విచ్చేసిన దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ,సతీమణి ,కవితను మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్ రెడ్డి శాలువాతో సత్కరించి ఆప్యాయంగా పలకరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ వామన్ గౌడు, మాజీ ఎంపీపీ మౌనిక మల్లేష్, సి డి సి చైర్మన్ ఆలయ కమిటీ సభ్యులు చంద్రశేఖర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ విశ్వేశ్వర్, మాజీ వార్డు సభ్యులు గంగు బాల్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రావుల కర్ణాకర్ రెడ్డి, నరోత్తమ్ రెడ్డి, కృష్ణారెడ్డి, శేఖర్ రెడ్డి, గాడిల ప్రశాంత్, శ్రీనివాసులు శెట్టి, బాదం వెంకటేశ్వర్లు, బాలయ్య నాయుడు, గోపాల్ రెడ్డి, రవీందర్ గౌడ్, హోటల్ రాజు, గోవర్ధన్, వాకిటి నర్సింహా, మురళీధర్ రెడ్డి, భరత్ రెడ్డి, కిషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



స్వామివారి కళ్యాణంలో మాజీ ఎమ్మెల్యే దంపతులు



స్వామివారికి పట్టు వస్త్రాలు తీసుకెళ్తున్న మాజీ ఎమ్మెల్యే

## పారిశుధ్య కార్మికుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలి : కలెక్టర్

**వనపర్తి టౌన్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :** మున్సిపాలిటీలు, గ్రామాల్లో పనిచేసే పారిశుధ్య కార్మికుల సంక్షేమానికి తీసుకోవాల్సిన అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం ఐ.డి.ఒ.సి సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మార్గుదొడ్లు శుభ్రం చేసే మాన్యువల్ స్కావేంజర్లు ఎవరైనా ఉన్నారా అని ఈ.డి.ఎస్సి కార్పొరేషన్ అధికారిని వివరాలు కోరగా అలాంటి వారు ఇప్పుడు జిల్లాలో ఎవరూ లేరని నివేదిక ఇచ్చారు. మున్సిపాలిటీల్లో, గ్రామాల్లో పనిచేసే పారిశుధ్య కార్మికుల సంక్షేమానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా ఇచ్చే అన్ని సంక్షేమ కార్యక్రమాలను పకడ్బందీగా వర్తింపచేయాలని సూచించారు. పారిశుధ్య కార్మికులకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి, సురక్ష భీమా పాలసీలు తప్పనిసరిగా చేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి. వెంకటేశ్వర్లు, ఈ.డి ఎస్సి కార్పొరేషన్ మల్లికార్జున్, ఆర్డీఓ సుబ్రమణ్యం, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

## తాలూకాలో కొత్త మండలాలు ఏర్పాటయ్యేదాకా పోరాటం చేస్తాం

**గద్వాల, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :** గద్వాల తాలూకాలో కొత్త మండలాలు ఏర్పాటయ్యేదాకా రాజీలేని పోరాటం చేస్తామని అఖిల పక్షం నాయకులు వెంకట్ రాములు, మోహన్ రావు, వైన్డింగ్ రాములు తెలిపారు. గద్వాల అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో ప్రజలు ప్రతిపాదించిన పలు తీర్మానాలు జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో వాల్మీకి భవనములో సోమవారం నూతన మండలాల ఏర్పాటు కొరకు సన్నాహక సమావేశంలో వక్తలు గ్రామాల నుంచి వచ్చినటువంటి నాయకులు, వివిధ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, సీనియర్ సిటిజన్ ఫోరం నాయకులు విస్తృతంగా మాట్లాడిన తర్వాత ఆయా గ్రామాల నుండి వచ్చిన నూతన మండలాల ప్రతిపాదనలను, కొరకు అందరిని కలుపుకొని మండలాలు ఏర్పాటు అయ్యేదాకా పోరాడుదామని వచ్చిన ప్రతిపాదనలను ఏకగ్రీవ తీర్మానం చేశారు. మల్దకల్ మండలం నుండి ఎల్కూరు, బిజ్వారం గట్టు మండల నుండి బలిగేర, మాచర్ల మిట్టదొడ్డి, చాగదొన ,ఐజ మండలం నుండి మేడికొండ, టిటి దొడ్డి ధరూర్ మండలం నుండి కేటి దొడ్డి, ఉప్పేరు, రేవులపల్లి, గద్వాల మండలం నుండి పూడూరు, అనంతపురం, కేటి దొడ్డి మండలం నుండి నందిన్నె, గిరిజన మండలంగా ఆలూరు రెండవ తీర్మానం, గద్వాల నియోజకవర్గంలోని ధరూర్, మల్దకల్, బలిగెర, మాచర్లను మున్సిపాలిటీలుగా ఏర్పాటుకు తీర్మానం చేశారు. గద్వాల, అలంపూర్ నియోజకవర్గాల్లో ఎంపీటీసీ స్థానాలను పెంచాలని తీర్మానం చేశారు. గద్వాల జిల్లాలో మున్సిపాలిటీలలో కౌన్సిలర్ స్థానాలను, పెంచాలని తీర్మానం చేశారు. గద్వాల నియోజకవర్గంలో నూతన పంచాయతీలు, ఎంపిటిసి స్థానాలు పెంచాలని సమావేశంలో తీర్మానం చేశారు. కార్యచరణ ఈనెల 17న అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ కి వినతి పత్రం ఇవ్వడానికి నిర్ణయం తీసుకున్నారు.

## స్థానిక సంస్థల ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితా ప్రకటన

**మార్పు చేర్పులు ఉంటే చెప్పాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచనలు :అదనపు కలెక్టర్**

**వనపర్తి టౌన్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :** స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ప్రతిపాదనలు చేసిన పోలింగ్ స్టేషన్ల వివరాలు పరిశీలించి ఏమైనా మార్పు చేర్పులు ఉంటే చెప్పాలని అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్ సూచించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వివరిస్తూ గ్రామ పంచాయతీల ఎన్నికలకు సంబంధించి ఇప్పటికే పోలింగ్ స్టేషన్ల వివరాలు వెల్లడించడం జరిగిందని, గోపాల్‌పేట మండలంలోని జింకలబీడు గ్రామ పంచాయతీ, కొత్తకోట మండలంలోని కనిమెట్ట గ్రామ పంచాయతీల్లో ముసాయిదా పోలింగ్ కేంద్రాల వివరాలు ఇవ్వడం జరిగిందని, ఏమైనా ఇబ్బందులు ఉంటే ఫిబ్రవరి 13న జరిగే రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగే సమావేశంలో చెప్పాలని సూచించారు. గోపాల్‌పేట మండలం జింకల బీడు తాండాలో ప్రాథమిక పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాలు, అంగన్వాడి సెంటర్ లో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారు. కొత్తకోట మండలంలోని కనిమెట్ట గ్రామ పంచాయతీలో అప్పర్ ప్రైమరీ స్కూల్ లో 10 పోలింగ్ కేంద్రాలు, అంగన్వాడి కేంద్రంలో రెండు పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితాను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు. వీటిలో ఏమైనా అభ్యంతరం ఉంటే చెప్పాలని సూచించారు. ఎంపిటిసి, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి సైతం ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితాను ఫిబ్రవరి 13న ప్రకటించడం జరుగుతుందని వాటిని పరిశీలించి అదేరోజు జరిగే రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించే సమావేశంలో చెప్పాలని సూచించారు. శ్రీరంగాపూరు మాజీ జడ్పీటీసీ, కాంగ్రెస్ ప్రతినిధి రాజేందర్ మాట్లాడుతూ శ్రీరంగాపూర్ గ్రామ పంచాయతీలో ఒకే చోట పోలింగ్ కేంద్రాలు ఉండటం వల్ల ఓటర్లకు దూర భారం పడనుందని అందువల్ల వాటిని విభజిస్తే బాగుంటుందని అదనపు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. స్పందించిన అదనపు కలెక్టర్ ఎంపిటిసి, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల జాబితా సందర్భంగా పరిశీలిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సుబ్రమణ్యం, డి.పి. ఒ సురేష్, కాంగ్రెస్ నుండి రాజేందర్, యం. ఐ.యం నుండి రహీమ్, టి.డి.పి. నుండి కొత్తగొల్ల శంకర్, భారాస నుంచి సయ్యద్ జమీల్, బసపా నుంచి జి. భరత్, భాజపా నుంచి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

## మహిళలకు స్వయం ఉపాధి పొందేందుకు ఎంతో దోహదపడుతాయి

**ఉప్పునుంతల, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :** మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు స్వంచంధ సంస్థలు అందించే అల్లికలను మహిళలు సద్వినియోగం చేసుకొని, ఉపాధి పొందేందుకు ఎంతో దోహదపడతాయని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. సోమవారం మాతృభూమి సంస్థ రూరల్ డెవలప్మెంట్ వారి ఆధ్వర్యంలో నిరుద్యోగ మహిళలకు వివిధ రంగాల్లో శిక్షణ పొందిన అభ్యర్థులకు నియామక పత్రాల పంపిణీ కార్యక్రమానికి అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల కేంద్రమైన ఉప్పునుంతల మండలరెడ్డి సేవా సమితి భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు ఇలాంటి కార్యక్రమాలు చేపట్టి మహిళలను అన్నిరంగాల్లో బలోపేతం చేసేందుకు కృషిచేయడం అభినందనీయమని, వారు అందించిన సేవలు ఎవరు మరువలేరని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణతో పాటు డిసిసిబిడైరెక్టర్, ఉప్పునుంతల సింగిల్ విండో చైర్మన్ సత్తు భూపాల్ రావు, మాతృభూమి రూరల్ డెవలప్మెంట్ డైరెక్టర్ రమాకాంత్, నాయకులు కట్ట అనంతరెడ్డి, తిప్పర్తి నరసింహారెడ్డి, మాజీ జడ్పీటీసీ అనంత ప్రతాప్ రెడ్డి, మాజీసింగిల్ విండోచైర్మన్, ప్రస్తుతం సింగిల్ విండో డైరెక్టర్ మద్దు నరేందర్‌రెడ్డి, రెడ్డి సేవా సమితి మండల అధ్యక్షుడు కట్ట చిన్న జనార్ధన్ రెడ్డి, మాజీ సర్పంచ్‌కట్ట సరిత, మండల మహిళా సమాఖ్య కార్యదర్శి పెద్దిరెడ్డి సునిత, శిక్షణ పొందిన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



శిక్షణ నియామక పత్రాలు అందుకుంటున్న మహిళలు

## బైపాస్ బాధితులకు కొత్తగా ఇండ్లు నిర్మించి ఇవ్వాలి

**- ఒక్కో కుటుంబానికి రూ.50 లక్షల నష్ట పరిహారం అందించాలి...**

**- బాధితులతో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఏదుట ధర్నా.. - సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:** చారకొండ మండల కేంద్రంలో జాతీయ రహదారి 167 రోడ్డుకు అడ్డంగా ఉన్న ఇండ్లను ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా అక్రమంగా 29 ఇండ్లను జెసిబిలతో నేలమట్టం చేయడంతో పేదలంతా దిక్కుతోచని స్థితిలో ఉన్నారని, బాధితులకు వెంటనే నూతన ఇండ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు మాట్లాడుతూ జాతీయ రహదారి బైపాస్ బాధితులకు ఎలాంటి ప్రత్యామ్నాయం చూపించకుండా హఠాత్తుగా వచ్చి అధికారులు, పోలీసు భారీగా మోహరించి వారి ఇండ్లను నేలమట్టం చేశారన్నారు. కనీసం తమ ఇంట్లో ఉన్న సామాన్లను తీసుకోవడానికి సమయం ఇవ్వండని అడిగిన ఇవ్వకుండా దౌర్జన్యంగా నిర్ధాక్ష్యణంగా కూల్చివేశారని ఆరోపించారు. గతంలో ఇచ్చిన నష్టపరిహారం బాధితులకు ఏమాత్రం సరిపోదని వారికి ఇచ్చిన పరిహారం కనీసం 100 గజాల జాగా కూడా రాని దుర్మార్గమైన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం బాధితులకు ఇంటి స్థలంతో పాటు ఇల్లు నిర్మించి ఇవ్వాలని నిర్వాసితులకు రూ.50లక్షలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బండపల్లి బాలస్వామి, గుంపల్లి అశోక్, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు అంతటి కాశన్న, బాధితులు రాజు, కిరణ్, అనిల్ సందూరి నరేష్, అలివేలు, శిరీష, గిరిజ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న బాధితులు, సీపీఎం నాయకులు

## కులాంతర వివాహ ప్రోత్సాహక బహుమతిని అందజేసిన జిల్లా కలెక్టర్



కులాంతర వివాహాల ప్రోత్సహాకాలను అందిస్తున్న కలెక్టర్

**గద్వాల, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :** సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో తమ ఛాంబర్ నందు ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎస్సీ కులాంతర వివాహ ప్రోత్సాహక బహుమతిని మంజూరు చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు. గద్వాల పట్టణానికి చెందిన లక్ష్మి (వైఫ్ ఆఫ్ సూర్య ప్రకాష్) ఎస్సీ కులాంతర వివాహం చేసుకున్నందుకు, ప్రభుత్వ స్కీమ్ ద్వారా 2,50,000 ప్రోత్సాహక బహుమతిగా మంజూరైనట్టు తెలిపారు. ఈ మొత్తాన్ని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ద్వారా ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపంలో జంటకు బాండ్‌ను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి సరోజ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## వెల్కిచర్లను ఎస్సీ రిజర్వు చేయాలని ఎమ్మార్వోకు వినతి

**భూత్పూర్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త :** తమ గ్రామ పంచాయతీ సర్పంచి పదవిని ఎస్సీ రిజర్వ చేయాలని కోరుతూ సోమవారం భూత్పూర్ మండలం వెల్కిచర్ల గ్రామానికి చెందిన మాదిగ యువశక్తి సంఘం ఆధ్వర్యంలో సభ్యులు తహసిల్దార్ జయలక్ష్మికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాదిగ యువశక్తి సంఘం సభ్యులు యాదయ్య, భీమన్న, కృష్ణయ్య, కుర్మయ్య, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేడు చేనేత కార్మికులకు పొదుపు నిధి పథకం అవగాహన సధస్సు

**గద్వాల, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :** చేనేత కార్మికులకు చేనేత పొదుపు నిధి థ్రిఫ్ట్ ఫండ్ పథకం గురించి అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు గోవిందయ్య ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు ప్రవేశపెట్టిన చేనేత పొదుపు నిధి థ్రిఫ్ట్ ఫండ్ పథకం గురించి, చేనేత జౌళి శాఖ సహాయ సంచాల ఆధ్వర్యంలో నేడు ఉదయం 9.00 గంటలకు స్వకలశాలి జివ్వేశ్వర నిలయం, కళ్యాణ మండపం పాండురంగ స్వామి దేవాలయం పక్కన గల ఫంక్షన్ హాల్ లో ట్రిప్టు పథకం గురించి అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి హాజరవుతారని, కాబట్టి గద్వాల చేనేత కార్మికులందరూ అవగాహన సదస్సుకు హాజరు కావాల్సిందిగా కోరనైనది.

## మహా పడి పూజలో కాంగ్రెస్ నాయకులు



మహా పడిపూజ పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

**పెబ్బేరు, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :** పెబ్బేరు మున్సిపల్ 7వ వార్డ్ మాజీ కౌన్సిలర్ ఎల్లస్వామి శివ స్వామి మాలదారణ వేసిన సందర్భంగా సోమవారంరోజు వారి స్వగృహంలో ఏర్పాటు చేసిన మాహ పడిపుజ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పూజ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేకపూజాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి బ్లాక్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్ గౌడ్, మండల అధ్యక్షుడు విజయ్‌వర్ధన్ రెడ్డి, టౌన్ అధ్యక్షుడు వెంకట్ రాములు యాదవ్, జిల్లా యువజన నాయకులు గంధం రంజిత్ కుమార్, జిల్లా బీసీ సెల్ నాయకులు బురమోని రాములు యాదవ్, మండల సీనియర్ నాయకులు యుగేందర్ రెడ్డి, సత్యా నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కృష్ణ ఆలయ ప్రతిష్టకు విగ్రహాల విరాళం

**కొత్తకోట, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :** కొత్తకోట మండల కేంద్రం న మీవంలో గల నూతన శ్రీ కృష్ణ ఆలయముకు శ్రీ కృష్ణ ప్రతిష్ట కార్యక్రమానికి మాజీ శాససభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి విరాళంగా 1.5 కేజీల వెండి వస్తువులను, స్వామివారి ఉత్సవ పంచలోహ విగ్రహాలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు రావుల దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసిలు వామన్ గౌడ్, పొగాకు విశ్వేశ్వర్, మాజీ ఎంపీపీ గుంత మౌనిక, ఎంపిటిసి ముంత సత్యం యాదవ్, ఆలయ కమిటీ సభ్యులు చిన్న తిమ్మన్న, బాలకొండన్న యాదవ్, హనుమంతు యాదవ్, మాజీ కౌన్సిలర్ రాముల యాదవ్, శివన్న యాదవ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



విగ్రహాలను అందజేస్తున్న రావుల దంపతులు

# రెండు రోజుల మహోత్సవం

## మహబూబ్‌నగర్ కార్పొరేషన్ ఏర్పాటు సందర్భంగా 14, 15 తేదీల్లో కార్యక్రమాలు

**సమీక్షించిన కలెక్టర్ విజయేంద్ర బోయి**



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:** 14,15 తేదీల్లో "మన మహబూబ్‌నగర్ మహోత్సవం" కార్యక్రమాన్ని మహబూబ్ నగర్ పట్టణంలోని శిల్పారామంలో ఉదయం 10.30 గంటల నుండి రాత్రి 8.30 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ మహబూబ్ నగర్ కార్పొరేషన్ ఏర్పాటు సందర్భంగా మహబూబ్‌నగర్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 14,15 తేదీల్లో రెండు రోజులు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫన్‌గేమ్స్, మూవీ నైట్, మార్కెట్ స్టాల్‌లు, ఫుడ్ స్టాల్‌లు, సాంస్కృతిక, ఎంటర్టైన్మెంట్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులతో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, మోహన్ రావు, డిఆర్ఓ కె.వి.వి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

## ◆ జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్

**నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:** ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ అన్నారు. సోమవారం వివిధ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ యోగేష్ గౌతమ్ బాధితుల నుండి 04 ఫిర్యాదులను స్వీకరించి వాటిని చట్టప్రకారం పరిశీలించవలసిందిగా సిఐ,ఎస్సైలకు సూచించారు. భూములకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్న కోర్టు ద్వారానే పరిష్కరించుకోవాలని ఫిర్యాదుదారులకు ఎస్పీ సూచించారు. బాధితులు తీసుకొచ్చే ఎలాంటి ఫిర్యాదులు పెండింగ్లో ఉంచరాదని వాటిని వెంటనే పరిష్కరించాలని ఫోన్లో మాట్లాడి సంబంధిత అధికారులకు సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజా సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ నిరంతరం పని చేస్తుందని, పోలీసులు ప్రజల మన్ననలు పొందే విధంగా విధులు నిర్వర్తించి వారికి సరైన న్యాయంఅందించి భరోసా, భద్రత కల్పించాలని సూచించారు. ప్రస్తుతం అధునాతన టెక్నాలజీ పెరుగుతున్నందున సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయి కావున ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అత్యవసర సమయంలో డయల్ 100 లేదా 1930 కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు.

# పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

## ◆ మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి


లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి

**అమరచింత, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ఇచ్చిన హామీల ప్రకారం అమలు చేస్తూ సంక్షేమ ప్రభుత్వం ముందుకెళుతుందని మక్తల్ ఎమ్మెల్యే, డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. సోమవారం అమరచింత మున్సిపల్ కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి, కేశం నాగరాజుగౌడ్ తో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికలలో రైతులకి రెండు లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చామని మక్తల్ నియోజకవర్గం లో 363 కోట్లు రుణమాఫీ చేశామని ఆయన అన్నారు. అలాగే మహిళలకు 500 కే సిలిండర్లు, 200 విద్యుత్ యూనిట్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు అనేక సంక్షేమ పథకాల అమలు చేస్తున్నామని ఆయన అన్నారు.వచ్చే స్థానిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రవికుమార్, డిసిసి జిల్లా కార్యదర్శి, అయూబ్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ పట్టణ మండల అధ్యక్షులు అరుణ్ కుమార్, కేజీ మహేందర్ రెడ్డి, మాజీ ఎంపిటిసిలు మహంకాళి విష్ణు, తిరుమలేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మండల రెడ్డి సంఘానికి ఆర్థిక సాయం


ఉప్పునుంతలరెడ్డి సంఘానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న సదగోడు రెడ్డి సోదరులు

**ఉప్పునుంతల, ఫిబ్రవరి10 ప్రభాతవార్త:** మండల రెడ్డి సేవా సమితి ఉప్పునుంతల వారికి సదగోడు గ్రామరెడ్డి సంఘం వారు లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మండల కేంద్రమైన ఉప్పునుంతలలో మండారెడ్డి సేవా సమితి భవనాన్ని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోనే ఆదర్శంగా ఉండేలా రెడ్డి సోదరుల ఆర్థిక సహకారంతో, మండల రెడ్డి సంఘం అధ్యక్షుడు కట్ట చిన్న జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్మించిన నూతన భవనానికి మౌలిక వనరులు కల్పించేందుకు తమ గ్రామం నుంచి ఆర్థిక సహాయం అందించాలని లక్ష్యంతో లక్ష ఆర్థిక సహాయాన్ని అందజేసినట్లు సదగోడు గ్రామ రెడ్డి సంఘం సోదరులు పేర్కొన్నారు. సోమవారం సదగోడు గ్రామ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో లక్ష రూపాయల నగదును ఉప్పునుంతల మండల రెడ్డి సేవా సమితి భవనంలోరెడ్డి సంఘం మండలాధ్యక్షుడు కట్ట చిన్న జనార్దన్ రెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల రెడ్డి సేవ సమితి అధ్యక్షుడు కట్ట చిన్న జనార్దన్‌రెడ్డి తో పాటు మాజీ సింగిల్ విండో చైర్మన్, ప్రస్తుతం సింగిల్ విండో డైరెక్టర్ మద్దు నరేందర్ రెడ్డి, రెడ్డి సేవా సమితి మండల ప్రధాన కార్యదర్శి కొత్త అచ్యుతారెడ్డి,సదగోడు గ్రామ రెడ్డి సంఘం అధ్యక్షుడు జీవన్ రెడ్డి, ఇటిక్యాల తిరుపతిరెడ్డి, వెంకట్ రెడ్డి,రమణ రెడ్డి, నాగిరెడ్డి, దేరెడ్డి లక్ష్మారెడ్డి, లింగా రెడ్డి, అల్వాల్ రెడ్డి, తిరుపతి రెడ్డి, కొరటికల్ చంద్రశేఖర్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు పంపిణీ


విద్యార్థులకు ప్యాడ్లు పంపిణీ చేసిన దృశ్యం

**రాజాపూర్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:** రాజపూర్ మండలం సింగమ్మగూడ గ్రామపంచాయతీ విస్లావత్ తండాకు చెందిన విస్లావత్ శ్రీనివాస్ నాయక్ తన జన్మదిన పురస్కరించుకొని సోమవారం రాజాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించే విద్యార్థులు మంచి చదువులు చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తన పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకొని ప్యాడ్లు అందజేసినట్టు తెలిపారు. అనంతరం రాజాపూర్ మండల కేంద్రంలో విస్లావత్ శ్రీనివాస్ నాయక్, వాల్యా నాయక్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని గిరిజన నాయకులు, వారి మిత్రులు కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఇటిక్యాల గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

**ఇటిక్యాల, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని గ్రంథాలయానికి ఇటిక్యాల గ్రామానికి చెందిన బోయ శ్రీకాంత్ నాయుడు రూ.6 వేల విలువగల పుస్తకాలను విరాళంగా ఇచ్చారు. ఇందులో యువత కోసం గ్రూపు 1,2,4 కు సంబంధించి వివిధ ఉద్యోగాలకు యువత సిద్ధం కావడానికి పుస్తకాలు దోహదపడతాయని దాత పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది మౌలాలి, రామకృష్ణారెడ్డి, నాగేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు

## ఇంటర్నేషనల్ స్కూల్స్ ధీటుగా సమీకృత రెసిడెన్షియల్ పాఠశాలలు : నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్‌రెడ్డి


నూతన పాఠశాల భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

**బిజినేపల్లి, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:** తమ ప్రభుత్వం విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తెచ్చిందని, ప్రతి పాఠశాలలో విద్యార్థులకు గుణాత్మక విద్య అందిస్తున్నట్లు నాగర్ కర్నూల్ ఎమ్మెల్యేకూచుకుల్ల రాజేష్ రెడ్డి అన్నారు. అరబిందో ఫార్మ సొసైటీ సిఆర్ఎస్ ఫండ్స్ కింద రెండు కోట్ల రూపాయలతో చేపట్టిన వట్టెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నూతన భవనానికి సోమవారం ఎమ్మెల్యే భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ దాతల సహకారంతో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం విద్యా వ్యవస్థ బలోపేతానికి 22 వేల కోట్లు కేటాయించిందని,గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో 6వేల పాఠశాలలు మూసివేసిన చరిత్ర గత ప్రభుత్వానిది అన్నారు.పేదల సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమని కార్పొరేట్ స్థాయిలో విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్య అందించి పిల్లల బంగారు భవిష్యత్తు కల్పిస్తామన్నారు. ఎమ్మెల్యే తమ సొంత సొసైటీ తరపున విద్యార్థులకుగ్రీన్ బోర్డులు ఏర్పాటు చేయిస్తామన్నారు. స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి పెండింగ్‌లో ఉన్న కొత్త భవనానికి నిధులు కేటాయించి పూర్తి చేస్తామన్నారు.పూర్వ విద్యార్థులు సండది నరేందర్ రెడ్డి, జగ్పాల్ రెడ్డి, సండది దేవేందర్ రెడ్డిలను నూతన పాఠశాలకు నిధులు తెచ్చేలా కృషి చేసినందుకు అభినందించారు. మాజీ సర్పంచ్ అమృత్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి తిరుపతిరెడ్డి, సురేందర్ రెడ్డి, మాన్యా నాయక్, రాగి మధుసూదన్‌రెడ్డి, భగవంతుగౌడ్, నీలం రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


నవోదయ పాఠశాలలో సిసి రోడ్డు ప్రారంభం చేస్తున్న ఎమ్మెల్యే

**నవోదయలో రూ. 25లక్షలతో సిసి రోడ్డు ప్రారంభం:** వట్టెం జవహర్ నవోదయ విద్యాలయంలో రూ. 25 లక్షలతో నిర్మాణం చేపట్టిన 500 మీటర్ల సీసీ రోడ్డును ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి ప్రారంభించారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పట్టణాల్లో ఉండేఇంటర్నేషనల్ స్కూల్స్ కు ధీటుగా సమీకృత రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేసి పేద,సామాన్య మధ్య తరగతి విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపడమే ప్రజా ప్రభుత్వలక్ష్యమన్నారు. ప్రపంచంతో పోటీపడే విధంగా అద్భుతమైన మానవ వనరులుగా విద్యార్థులను తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. నేటి విద్యార్థుల భవిష్యత్తు రేపటి దేశ భవిష్యత్తు అని అందుకోసం రాష్ట్ర సంపాదన విద్యకు పెద్ద ఎత్తున ఖర్చు పెట్టడానికి సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. విద్యార్థుల అభివృద్ధిని ఈ రాష్ట్ర అభివృద్ధిగా తమ ప్రభుత్వం భావిస్తుందన్నారు. ప్రిన్సిపాల్ పి.భాస్కర్ కుమార్, పిఆర్ డిఈ జవహర్‌బాబు,పిఎసిఎస్ మాజీచైర్మన్ మలిశెట్టి వెంకటస్వామి, డైరెక్టర్ వెంకటస్వామి,మిద్దెరాములు, తిరుపతయ్య, ఈశ్వర్, శ్రీనివాస్ గౌడ్, మోహన్ రెడ్డి,మల్లేష్ యాదవ్, భగవంతుగౌడ్, నరేందర్ గౌడ్ చైతన్య యోజన సంఘం ,అభ్యుదయ హిందూ సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి కుటుంబానికి అండగా ఉంటాం

## -ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి


మృతురాలి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

**వెల్దండ, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:** వెల్దండ మండలంలోని చొక్కనపల్లి గ్రామానికి చెందిన విద్యార్థి ఆరాధ్య బాలనగర్ గురుకుల పాఠశాలలో పదవ తరగతి చదువుతూ శనివారం క్లాస్ రూమ్‌లో ఉరివేసుకొని మృతి చెందారు. సోమవారం ఆరాధ్య స్వగ్రామమైన చొక్కనపల్లికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి విచ్చేసి కుటుంబాన్ని పరామర్శించి ఆరాధ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మృతి చెందిన విద్యార్థి ఆరాధ్య కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని, ఎమాత్రం అధైర్యపడకుండా ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. మృతికి ఎవరన్నా కారణమని తేలితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు.కార్యక్రమంలో పిసిబి మెంబర్ ఠాగూర్ బాలాజీ సింగ్, వెల్దండ గ్రామ మాజీ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఉమా మనీలా సంజీవ్ యాదవ్, తహసిల్దార్ కార్తీక్‌కుమార్, మండలపార్టీ అధ్యక్షులు మోతిలాల్‌నాయక్, పర్వత్‌రెడ్డి, జక్కుల జంగయ్య యాదవ్, మట్ట వెంకటయ్య గౌడ్, చేర్క రాజశేఖర్, పుల్లయ్య, అలీ, నారాయణ నాయక్, ఎర్ర శ్రీను ముదిరాజ్, రమేష్ తదితరులు ఉన్నారు.

# వైభవంగా శ్రీభవానిశంకర దేవాలయ ధ్వజస్థంభ ప్రతిష్టాపన


పూజలో పాల్గొన్న నాయకులు

**కొత్తకోట, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:** గత మూడు రోజులుగా భక్తి శ్రద్ధలతో వైభవంగా జరుపుకుంటున్న ధ్వజస్థంభ, నవగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వేద పండితులు శ్రీశైల మఠ సారంగదర కోటేశ్వర స్వామి వారి ఆధ్వర్యంలో ధర్మకర్తలు బల్లే వంశీయులు బల్లే ఫణి శంకర్, బల్లే శ్రీధర్, బల్లే మల్లికార్జున్, బల్లే విశ్వనాథ్ చేతుల మీదుగా వీరశైవ ఆగమ శాస్త్ర ప్రకారం ఉ॥ 10:30 నిఖిలకు ధ్వజస్థంభ యంత్ర ప్రతిష్ఠ, నవగ్రహ ప్రతిష్ఠ, శిఖర కలశ ప్రతిష్ఠ నిర్వహించారు. అనంతరం భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతించారు. వేల సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకోవడంతో భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి భక్తులను క్రమ పద్ధతిలో ఆలయంలోకి ప్రవేశింపచేసి దర్శనం కల్పించారు. ఊరంతా నిండుగాఇంటింటా పండగ భవాని శంకర ధ్వజస్థంభ ప్రతిష్ఠ పురస్కరించుకుని గ్రామ ప్రజలు పెద్దఎత్తున బంధువులను ఇంటి ఆడపడుచులు ఆహ్వానించి పెద్ద ఎత్తున పండగ జరుపుకోవడం తో ఊరంతా భక్తులతో కిటకిటలాడుతూ ఎక్కడ చూసిన ఊరినిండా భక్తులే కనబడుతున్నారు. ప్రతిష్ఠ సందర్భంగా ఇంటి ఆడపడుచులకు వడిబియ్యం, బట్టలు పెట్టడం వంటివి తరతరాలుగా సాంప్రదాయంగా వస్తుండటంతో ప్రతిఒక్కరు కూడా ఆడపడుచులను, బంధుమిత్రులను పిలుచుకున్నారు. అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో అన్నదాన పర్యవేక్ష ణధ్వజస్థంభ ప్రతిష్ఠ మహోత్సవానికి భక్తులు తండోపతండాలుగా రావడంతో భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా అన్నదానంజరగాలని అయ్యప్ప సేవా సమితి అధ్యక్షులు ధూపం నాగరాజు పర్యవేక్షణలో సేవా సమితి సభ్యులు, హిందువాహిని సభ్యులు, శ్రీవారి సేవకులు పాల్గొని అన్నప్రసాద వితరణ సవ్యంగా సాగేలా పర్యవేక్షించారు. గత మూడు రోజుల పాటు భక్తులకు కీ.శే పొగాకు శైలజమ్మ, భద్రప్ప జ్ఞాపకార్థం కుమారులు పొగాకు మహేష్ బాబు, పొగాకు రాఘవేంద్ర ప్రసాద, పొగాకు అనీల్ కుమార్ అన్నదానం ఏర్పాటుచేశారు.ధ్వజస్థంభ ప్రతిష్ఠ పురస్కరించుకుని ప్రముఖులు చాలా మంది అమ్మవారిని దర్శించుకున్నారు. మాజీ శాసన సభ్యులు ఆల వెంకటేశ్వర రెడ్డి, రావుల రవీంద్రనాథ్ రెడ్డి, స్థానిక శాసనసభ్యులు జి.మధుసూదన్ రెడ్డి సతీమణి కవిత, స్థానిక నాయకులు గోళ్లబాబు, వామన్ గౌడ్,బీసం చెన్నకేశవరెడ్డి,ప్రశాంత్, గుంతమౌనిక, పాపయ్యగారి కృష్ణారెడ్డి తదితరులు ప్రముఖులకు ఆలయ కమిటీ తరపున పూర్ణకుంభ స్వాగతం పలికి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు,ప్రముఖులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తాం

## వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి

**ఖిల్లాఘణపురం, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని పలు గ్రామాలలో సి ఆర్ ఆర్, ఎస్ సిపి, నిధులతో సిసి రోడ్లు డ్రైనేజీ పనులు చేపట్టడం కోసం నిధులను మంజూరు చేశామన్నారు ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి పల్లెను అభివృద్ధి పథంలో నడిపిస్తామని చెప్పారు. ప్రతి గ్రామానికి కావలసిన అన్ని రకాల మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడం కోసం కృషి చేస్తామన్నారు. స్వాతంత్రం వచ్చిన నాటి నుంచి కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలోనే గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందాయన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేఘారెడ్డి సురాయిపల్లి,ఉప్పరపల్లి,సోలిపురం,రుక్కనపల్లి,ఆగారం ,కమాలుద్దీన్ పూర్, వెంకటంపల్లి ,ఘణపురం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు భూమి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి రవీందర్ రెడ్డి పిఎసిఎస్ అధ్యక్షులు మురళీధర్‌రెడ్డి,వెంకట్రావు, పిఎసిఎస్ ఉపాధ్యక్షులు కామరాజు, సాయి చరణ్ రెడ్డి ,ఆగారం ప్రకాష్ , దామోదర్‌రెడ్డి ,శ్యాంసుందర్‌రెడ్డి, ఆయాగ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.


సోలిపురంలో అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

# విద్యార్థులకు చట్టాలపై అవగాహన



విద్యార్థినిలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**అడ్డాకుల, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :** రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ మరియు జిల్లా చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు జిల్లా న్యాయ అధికార సంస్థ మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి డి. ఇందిర సోమవారం అడ్డాకుల ప్రభుత్వ జూనియర్ కళాశాల యందు విచ్చేసి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. బాల్యవివాహాలు చేసుకునేవారు చట్ట ప్రకారము అమ్మాయికి 18 సంవత్సరాలు అబ్బాయికి 21 సంవత్సరాలు నిండిన తర్వాతనే పెళ్లి చేసుకోవాలని ఇలా కాకుండా చేస్తే చట్ట ప్రకారం శిక్షార్హులు అవుతారని అంతేకాకుండా ఫోక్సో చట్టం లైంగిక నేరాల గురించి వాటి శిక్షల గురించి వివరించడమే కాకుండా బాల కార్మికుల గురించి ప్రస్తావిస్తూ ఈ చట్టం 18 సంవత్సరాలు నిండిన బాల బాలికలను చదువుకునే వయసులో వారిని శ్రమ దోపిడీకి గురి చేయరాదని ముఖ్యంగా బాల బాలికలను మత్తు పదార్థాలకు అలవాటు చేసి మత్తులోకి దించి వారిచే మత్తు పదార్థాలు సరఫరా చేయించి వారిని వాడుకోవడమే కాకుండా శారీరకంగా మానసికంగా ఏ విధంగా నష్టపోతున్నారని క్లుప్తంగా వివరించారు.అంతేకాకుండా కళాశాలలో ర్యాగింగ్ చేస్తుంటారు ర్యాగింగ్ నిరోధించటానికి చేపట్టే చర్యలు యాంటీ ర్యాగింగ్, ర్యాగింగ్ చేస్తే వారికి రెండు సంవత్సరాలు జైలు శిక్ష, పదివేల రూపాయల వరకు జరిమానవిధించబడుతుంది అని చెప్పడమే కాకుండా కళాశాల యందు ముఖ్యంగా లైంగిక వేధింపులు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రధానోపాధ్యాయులు కె. శివరామకృష్ణ, తిరుమలేష్, కళాశాల సిబ్బంది విజయలక్ష్మి, ప్రవీణ్ కుమార్, వెంకటేశ్వర్లు, శశి కుమార్, కృష్ణవేణమ్మ, కల్పన, నాగ చందర్, గేమ్యా నాయక్, భాష, సంతోష్, మొదలగు సిబ్బంది పాల్గొన్నారు.

# కాలిన శవం యాదగిరిదే

## ◆గుర్తించిన కుటుంబ సభ్యులు
## ◆అనుమానాస్పద మృతిగా కేసు నమోదు


మృతి చెందిన యాదగిరి (ఫైల్ ఫోటో)

**బిజినేపల్లి, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని పాత ఎంపీ డీవో కార్యాలయంలో దగ్ధమైన పాత దస్త్రాలు తొలగిస్తుండగా బయటపడ్డ శవం కుమ్మ యాదగిరి (50)గా గుర్తించారు. ఎస్సై కె. శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు ఆదివారం సాయంత్రం వేళ ఎంపీడీవో పాత భవనం లోపలి నుండి పెద్ద ఎత్తున మంటలు చెలరేగడాన్ని అటుగా వెళ్ళిన స్థాని కులు గమనించి సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం అందించి మంటలను ఆర్పిగదిలోని దస్త్రాలు సామాగ్రిని తొలగిస్తుండగా మంటల్లో కాలిన మృతదేహం లభించినట్లు వివరించారు. పూర్తిగా కాలినశవాన్ని నాగర్‌కర్నూల్ ఏరియా ఆసుపత్రిలో భద్రపరిచినట్లు చెప్పారు. సోమవారం తెల్లవారుజామున మృతి చెందిన శవాన్ని బిజినపల్లికి చెందిన కుమ్మ యాదగిరిగా ఆయన కుమారుడు నరేష్ వికలత్వంగా ఉన్న శవాన్ని గుర్తించినట్లు చెప్పారు. వికలాంగుడైన యాదగిరి భార్య అలివేల మూడేళ్ల క్రితం చనిపోవడంతో మండల కేంద్రంలో చిత్తు కాగితాలు వేరుకొని జీవనం సాగిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. కాగా కార్యాలయం దద్దమైన సంఘటనలో యాదగిరి శవం లభించడంతో కుటుంబీకుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై శ్రీనివాస్ వివరించారు.

# ఆర్టీసీ బస్సు బైక్ ఢీ కొని వ్యక్తి మృతి


చెందిన విగ్నేశ్వర్ రెడ్డి

**కొత్తకోట, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ నుండి వనపర్తి వెళ్తున్న ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ ఎదురుగ వస్తున్న మోటర్ సైకిల్ ఢీ కొని వ్యక్తి మృతి చెందిన సంఘటన కొత్తకోటలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం అడ్డాకల్ మండలం గుడిబండ గ్రామానికి చెందిన విగ్నేశ్వర్‌రెడ్డి దంపతులు అత్తగారి ఊరైనా కొత్తకోటలో అంబభవాని దేవాలయంలో జరుగుతున్నా ధ్వజస్తంభం కార్యక్రమానికి వచ్చారు. పూజ కార్యక్రమం ముగిసిన తర్వాత అత్తగారి ఇంటి నుండి విగ్నేశ్వర్ రెడ్డి మోటార్ సైకిల్ పై స్వగ్రామానికి బయలుదేరాడు. మహబూబ్‌నగర్ నుండి వనపర్తి వెళ్తున్న ఆర్టీసీ బస్సు వనపర్తి వెళ్తుండగా ఎదురుగ వస్తున్నా మోటార్ సైకిల్ ఎదురెదురుగా ఢీ కొన్నాయి. దింతో మోటర్ సైకిల్‌పై ఉన్న విగ్నేశ్వర్‌రెడ్డికి (50) తలకు బలమైన గాయం కావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతుని వనపర్తి జిల్లా హాస్పిటల్ కు పోస్టుమార్టంనిమిత్తం తరలించారు.కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

# ప్రభాకర్‌కు ఘన నివాళి


కీ॥శే॥ ప్రభాకర్ 6వ వర్ధంతిని జరుపుకున్న ప్రజాసంఘాల నాయకులు

**ఇటిక్యాల, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:** నిత్యం పేద ప్రజల కోసం పరితపించే నాయకుడు ప్రభాకర్ ప్రజల మదిలో నిలిచారని ప్రజా సంఘాల నాయకులు గుర్తు చేసుకున్నారు. ఇటిక్యాల మండల పరిధిలోని యాక్తపురం గ్రామానికి చెందిన కీ॥శే ప్రభాకర్ 6వ వర్ధంతి సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్‌లో ఆయన చిత్రపటానికి ప్రజాసంఘాల నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ నిత్యంపేద ప్రజల సమస్యలపై పోరాడే వారిని సమాజం కోసం పరితపించే వ్యక్తి అని ఆయన మరణం నడిగడ్డ ప్రజలకు తీరని లోటని అనేక ఉద్యమాలలో అంతేకాక, తెలంగాణ ఉద్యమంలో ఆయన చురుకుగా పాల్గొనేవారని వామపక్ష భావజాలంతో తోటి వారికి సహాయపడే గుణం ఆయన సొంతం అని గుర్తు చేశారు . ఈ కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాలు, అఖిల పక్ష నాయకులు, విద్యార్థి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

**అడ్డాకుల ఫిబ్రవరి10 ప్రభాతవార్త:** మండల పరిధిలోని పొన్నకల్ గ్రామం లో గుర్తుతెలియని వ్యక్తి శవం లభ్యం వివరాలకు వెళ్తే సోమవారం గ్రామ శివారులోనూ ఒపల్లి చెరువులో గుర్తు తెలియని మగ వ్యక్తి శవం లభ్యమై నట్లు ఎస్సై తెలిపారు.ఎటువంటి బట్టలు లేకుండా లోదుస్తులు ఒకటి కలిగి ఉండి ప్రమాదవశాత్తు చెరువులో పడి చనిపోయి ఉన్నాడు. వ్యక్తి ఆచూకీ తెలిసినచో ఈ క్రిందిఫోన్‌నెంబర్లకు 8712659353, 8712659316, సమాచారం తెలియజేయగలరని ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

# డీఈఓ కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

**నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:** మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు, కోడిగుడ్లు కార్మికుల వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం డీఈవో కార్యాలయం ముందు తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులచే డిఇఓ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. అనంతరం తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.వెంకటేష్ మాట్లాడుతూ పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలని ఆయన అన్నారు. 7 నెలలు గడుస్తున్నా పెండింగ్ బిల్లులు ఇవ్వక పోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సంబంధిత అధికారులు పెండింగ్ బిల్లుల విషయాన్ని పట్టించుకోవడం లేదన్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను తక్షణమే అమలు చేయాలని కార్మికులకు భీమా సౌకర్యం కల్పించాలని వంట చేసే క్రమంలో కార్మికులు ప్రమాదాలకు గురైతే వారికి ప్రభుత్వం రూ.10 లక్షలు ఇవ్వాలన్నారు.విద్యార్థులకు మెస్ చార్జీలు రూ.25 పెంచాలన్నారు. కెసిఆర్ ప్రభుత్వంలో కార్మికులకు మూడు వేల రూపాయలు ఇస్తామన్నా మాట నేటికీఅమలు కాలేదని ఈ ప్రభుత్వమైనా అమలు చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చి సంవత్సరం దాటిన మధ్యాహ్న భోజన కార్మికులను పట్టించుకోవడం లేదన్నారు.అనంతరం పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని డిఈఓకు అందజేశారు. బిల్లుల చెల్లింపు విషయంలో నిర్లక్ష్యం చేస్తే కార్మికుల పక్షాన ఉండి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు వెంకటమ్మ, లక్ష్మి, సత్యమ్మ, దేవమ్మ,పాపమ్మ, తిప్పమ్మ, అనంతమ్మ, చంద్రమ్మ, అంజమ్మ, లక్ష్మమ్మతో బాటు తదితరులు ఉన్నారు.


వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

# భక్తిశ్రద్ధలతో మహాకుంభ ప్రోక్షణ ప్రాణప్రతిష్ఠ

■ కన్నుల పండుగగా శాంతి కళ్యాణం



శాంతి కళ్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

**బిజినేపల్లి, ఫిబ్రవరి10 ప్రభాతవార్త:** శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి దివ్యాలయ ప్రతిష్ట మహోత్సవంలో భాగంగా సోమవారం మహాకుంభ ప్రోక్షణ ప్రాణప్రతిష్ఠా, శాంతి కళ్యాణం వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛారణ మధ్య భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. ఉదయం ద్వారతోరణ ధ్వజ కుంభారాధన, ప్రాతరారాధన, అర్చన, సేవాకాలం, చతుస్థానార్చన, హోమం, నివేన, వారము శాలాబలి, మహాపూర్ణాహుతి నిర్వహించారు. మహాకుంభ ప్రోక్షణ ప్రాణప్రతిష్ఠా, దృష్టికుంభం, ప్రథమారాధన, అర్చన, మహానివేదన, శాంతి కళ్యాణం, యజమానులకు ఆశీర్వచనం, తీర్థప్రసాద వినియోగం ఆచార్య సన్మానము, కార్యక్రమ పరిసమాప్తి, సాయంత్రం శ్రీస్వామి వారి తిరువీధి కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. శ్రీశ్రీశ్రీ త్రిదండి అష్టాక్షరి సంపత్ కుమార రామానుజ జీయర్ స్వామి వారి ప్రత్యక్ష పర్యవేక్షణలో, "ఆగమసార్వభౌమ" శ్రీమద్వాథూలసముద్రాల రమాకాన్తాచార్య స్వామి వారి అనుగ్రహముతో పఞ్చాహ్నిక దీక్షతో భక్తి కార్యక్రమాలునిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు తిప్పిరెడ్డి నందకిషోర్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు కృష్ణమాచారి, తిప్పి రెడ్డిరామిరెడ్డి, ఆవులరాములు, ప్రభాకర్, ఆచారిచిదర శంకర్, వెంకటస్వామి, వెంకటేశ్వర్లు, వేముల భూపతి గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## వట్టెం, వడ్డేమాన్ ఆలయాల్లో ఎమ్మెల్యే పూజలు



ఎమ్మెల్యేను ఆశీర్వదిస్తున్న ఆలయ అర్చకులు

**బిజినేపల్లి, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:** వట్టెం శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్‌రెడ్డి ప్రత్యేక పూజలు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. లక్ష్మి గోదాదేవి వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛారణ మధ్య నిర్వహించిన ఎమ్మెల్యే ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు సందడి నరేందర్‌రెడ్డి ఎమ్మెల్యే రాజేష్ రెడ్డిని సన్మానించారు. నంది వడ్డేమాన్ గ్రామంలో చెన్నకేశవ స్వామి ప్రతిష్ట మహోత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఆయన వెంట మాజీ ఎంపిటిసి తిప్పిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, శెట్టిరాజేష్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



స్వయం పరిపాలన దినోత్సవంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

**రాజాపూర్, ఫిబ్రవరి10 ప్రభాతవార్త:** మండలంలోని తిర్మలాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులే ఉపాధ్యాయులై ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కలెక్టర్‌గా అనూష, ఆర్‌జెడి సింధుజ, డీఈవోగా శృతి, ఎంఈవోగా హేమలత, హెచ్‌ఎంగా జశ్వంత్, డిప్యూటీ డిఈఓగా సుస్మిత, ఐపిఈ సందీప్, పీఈటీలుగా ప్రకాష్, కీర్తన, వ్యవహరించారు. ప్రతిభ కనబరిచిన వారిని ఉపాధ్యాయ బృందం అభినందించారు. కార్యక్రమంలో జిహెచ్‌ఎం సుధాకర్, కేశవులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## పెండింగ్‌లో ఉన్న అర్జీలను వెంటనే పరిష్కరించాలి

నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న అధికారులు

**నారాయణపేట టౌన్, ఫిబ్రవరి10 ప్రభాతవార్త:** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ పెండింగ్లో ఉన్న అర్జీలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులకు సూచించారు. ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 20 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ రాంచందర్, ఎఓ జయసుధ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రిని కలిసిన పేట ఎమ్మెల్యే

**నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:** నారాయణపేట నియోజకవర్గం సమస్యలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును సోమవారం నారాయణపేట ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి కలిసి నియోజకవర్గ సమస్యల గురించి వివరించి చర్చించారు.

## 37 మందికి హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి

**జోగులాంబ జోన్ 7 డిఐజి ఎల్‌ఎస్ చౌహాన్ వెల్లడి**

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:** జోగులాంబ జోన్7 లో 37 మంది పోలీస్ కానిస్టేబుల్‌లకు హెడ్ కానిస్టేబుల్ గా పదోన్నతి పొందినట్లు జోగులాంబ జోన్ డిఐజి ఎల్‌ఎస్ చౌహాన్ తెలిపారు. 37 మంది సిసిలకు హెచ్‌సిలుగా పదోన్నతి పొందినట్లు ఉత్తర్వులు జారీ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 22మందికి, నాగర్‌కర్నూలు జిల్లాలో ఐదుగురికి, వనపర్తి జిల్లాలో ఆరుగురికి, జోగులాంబ గద్వాల్ జిల్లాలో ముగ్గురికి, నారాయణపేట జిల్లాలో ఒకరు పదోన్నతి పొందారు.

## ఆయుష్ డైరెక్టర్ లక్ష్మికి ఎమ్మెల్యే వినతి

**నారాయణపేట టౌన్, ఫిబ్రవరి10 ప్రభాతవార్త:** ఆయుష్ డైరెక్టర్ చిట్టెం లక్ష్మి ఐఏఎస్‌కు కార్యాలయంలో సోమవారం నారాయణపేట నియోజకవర్గ ఎమ్మెల్యే చిట్టెం పర్ణికరెడ్డి కలిసి నారాయణపేటలో ఇంటిగ్రేటెడ్ ఆయుష్ హాస్పిటల్ ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం పలు విషయాలపై ఎమ్మెల్యే చర్చించారు.



## స్థానిక సంస్థల ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించడంలో..

# రిటర్నింగ్ అధికారులదే కీలక పాత్ర

■ ఎన్నికల నిబంధనలు రిటర్నింగ్ అధికారికి క్షుణ్ణంగా తెలిసి ఉండాలి

■ వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



ఎన్నికల నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న జిల్లా కలెక్టర్

**వనపర్తి టౌన్, ఫిబ్రవరి10 ప్రభాతవార్త :** స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించడంలో రిటర్నింగ్ అధికారి కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. అందుకే ప్రతి రిటర్నింగ్ అధికారికి ఎన్నికల నిబంధనలు క్షుణ్ణంగా అర్థం అయ్యే విధంగా శిక్షణ ఇవ్వాలని మాస్టర్ ట్రైనర్లని ఆదేశించారు. సోమవారం సాయంత్రం ఐ.డి.ఓ.సి సమావేశ మందిరంలో మాస్టర్ ట్రైనర్లకు నిబంధనల పై కలెక్టర్ అవగాహన కల్పించారు. మాస్టర్ ట్రైనర్లు ఫిబ్రవరి 12న రిటర్నింగ్ ఆఫీసర్లకు శిక్షణ ఇవ్వనున్న నేపథ్యంలో మాస్టర్ ట్రైనర్‌లకు కలెక్టర్ మరోమారు అవగాహన కల్పించారు. నామినేషన్ వేసేందుకు వచ్చిన ప్రతి పోటీ దారుకి ఎన్నికల్లో పోటీ చేసే విధంగా అవకాశం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. నామినేషన్ వేసేందుకు వచ్చిన అభ్యర్థితో పాటు ప్రతిపాదకుడు, మరో వ్యక్తి కలిపి ముగ్గురిని రిటర్నింగ్ అధికారి గదిలో అనుమతించాలని సూచించారు. నామినేషన్ సరిగ్గా ఇచ్చే విధంగా అవగాహన కల్పించాలని నామినేషన్ పత్రంలో ఏమైనా తప్పులు, లోపాలు ఉంటే పరిశీలించినోటీస్ ఇవ్వాలని సూచించారు. జడ్పీటీసీ కి పోటీ చేసేందుకు 5000 లు ఎంపిటిసికి అయితే 2500 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఎస్సి, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం రాయితీ ఉంటుందన్నారు. సర్పంచి, వార్డు మెంబర్‌గా పోటీ చేసేందుకు వారి పేర్లు సంబంధిత గ్రామ పంచాయతీ ఓటరు జాబితాలో పేరు తప్పక ఉండాలని, అదే జడ్పీటీసీ గా పోటీ చేసేందుకు తప్పనిసరి కాదు అన్నారు. నామినేషన్ పత్రాలు స్వీకరించే రోజు నుంచి స్క్రుటిని , వితడ్రా, గుర్తులు కేటాయింపు వరకు ప్రతి చోట రిటర్నింగ్ అధికారి తీసుకోవాల్సిన బాధ్యతలు, ఎన్నికల నిబంధనల పై అవగాహన కల్పించారు. రిటర్నింగ్ అధికారులకు ప్రతి అంశం అర్థమయ్యే విధంగా శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, అదనపు కలెక్టర్ రెవెన్యూ జి.వెంకటేశ్వర్లు, జడ్పిసిఈఓ యాదయ్య, ఆర్డీఓ సుబ్రమణ్యం, డి.పి.ఒ సురేష్, మాస్టర్ ట్రైనర్లు తదితరులు పాల్గొన్నారు.

# భూ సర్వే శాంతి భద్రతల మధ్య పూర్తి చేయాలి

◆ మల్టీజోన్2 ఐజిపి సత్యనారాయణ



మల్టీజోన్2 ఐజిపి సత్యనారాయణకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

**నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:** నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకానికి సంబంధించిన మొదటి దశ భూ సర్వేని పూర్తిచేయాలని మల్టీజోన్2 ఐజిపి సత్యనారాయణ ఐపీఎస్ జిల్లా అధికారులకు సూచించారు. సోమవారం నారాయణపేట జిల్లా కేంద్రానికి వచ్చిన మల్టీజోన్ 2 ఐజీపీ సత్యనారాయణకు, జోగులాంబ జూన్ 7 డిఐజి ఎల్ ఎస్ చౌహాన్ ఐపిఎస్, నారాయణ పేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎస్పీ యోగేష్ గౌతమ్‌లు స్థానిక పంచాయతీరాజ్ అతిథి గృహం వద్ద పూల బొక్కె ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం కొడంగల్ ఎత్తిపోతల పథకం భూ సర్వే గురించి చర్చించారు. ఈ సందర్భంగా మల్టీ జోన్ 2 ఐజిపి సత్యనారాయణ మాట్లాడుతూ నారాయణ పేట కొడంగల్ ఎత్తిపోతల పథకం కోసం ఎల్‌ఏ ఆర్‌ఆర్ యాక్ట్ .2013 ప్రకారం భూ సర్వేను చట్ట ప్రకారం చేయడం జరుగుతుంది. అలాగే ల్యాండ్ సర్వే చేసే సమయంలో ఎవరైనా చట్ట విరుద్ధంగా ప్రేరేపించినట్లు రుజువైతే అట్టివ్యక్తులపైచట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. అయితే సర్వే చేసే సమయంలో అసలు భూమి లేని వాళ్ళే ఆటంకం కలిగించే ప్రయత్నం చేస్తున్నట్లు తమకు సమాచారం ఉందన్నారు. సర్వేమొదటి దశ భూసర్వే జరిగే సమయంలో ఎవరికైనా ఎలాంటి అభ్యంతరాలు ఉంటే నోటిఫికేషన్ 60 రోజుల లోపు నారాయణ పేటఆర్డీవో, జిల్లా కలెక్టర్‌కు తమ తమ అభ్యంతరాలు తెలపాలని ఆయన కోరారు. కానీ నియమ, నిబంధనల ప్రకారం జిల్లాలో కొనసాగుతున్న భూసర్వేను ఉద్దేశపూర్వకంగా ఎవరైనా అడ్డుకునే ప్రయత్నం చేస్తే వారిపై చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని డిఐజి సత్యనారాయణ, జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్‌ను ఆదేశించారు. ఈకార్యక్రమంలో జోగులాంబ జోన్7 డిఐజి ఎల్‌ఎస్‌చౌహాన్ ఐపిఎస్, జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ పాల్గొన్నారు.

# పరీక్షలను పండగలా భావించాలి

**పరీక్ష పే చర్చలు విద్యార్థులకు ప్రధాని సూచనలు**



పరీక్ష పే చర్చను వీక్షిస్తున్న విద్యార్థినీ, విద్యార్థులు

**నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :** పరీక్షలు ఒత్తిడి లేకుండా రాయాలని పరీక్షల కన్న జీవితం గొప్పదని పరీక్షలను పండగల భావించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విద్యార్థులకు సూచించారు. సోమవారం పరీక్ష పేచర్చలో భాగంగా నారాయణ పేట మండలం జాజాపూర్ ఉన్నత పాఠశాల లో ప్రధానమంత్రి ఇచ్చిన సందేశాన్ని డిజిటల్‌టీవీలో విద్యార్థులు వీక్షించారు. పరీక్షలు తప్పినంత మాత్రాన నిరాశ నిస్పృహ పడాల్సిన అవసరం లేదని నిరంతరం ప్రశాంతంగా ఇతరులతో పోల్చుకోకుండా పరీక్షలకు సిద్ధం కావాలని తెలిపారు. సందేహాలను గురువులతో సన్నిహితంగా ఉంటూ తీర్చుకోవాలని తెలియని విషయాలను తెలుసుకోవడంలో తప్పు లేదని ఉద్బోధించారు. సరైన మోతాదులో నిద్ర, ఆహారం ఉండాల్సిందేనని ఆరోగ్యంగా ఉంటేనే కదా పరీక్షలు రాసేదని నొక్కిచెప్పారు. ప్రధాని ఇచ్చిన అమూల్యమైన సూచనలను పాటించి పరీక్షలకు అన్ని రకాలుగా సిద్ధం కావాలని ప్రధానోపాధ్యాయురాలు భారతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బందితోపాటు విద్యార్థులు తదితరులు ఉన్నారు.

# భూత్పూర్ మున్సిపాలిటీ చైర్మన్ పదవి కోసం ఆరాటం

-కుర్చీ కోసం టీఎంగౌడ్, ఎల్‌ఎన్‌గౌడ్‌ల పోరాటం
-ఎంపిపి స్థానానికి కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల మధ్య గట్టిపోటి
-జెడ్పీ చైర్మన్ గిరిపై కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి గురి
-స్థానిక సమరానికి సై అంటున్న అధికార, ప్రతిపక్ష నాయకులు
-ప్రతిపక్షం కంటే అధికార పక్షంలోనే పోటీ ఎక్కువ
-రసవత్తరంగా మారనున్న 2025 స్థానిక ఎన్నికలు

**భూత్పూర్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:** తెలంగాణలో ఒకటి, రెండు నెలల్లో జరిగే స్థానిక పోరుకు టికెట్లనాశిస్తున్న ఆయా పార్టీల అభ్యర్థులు పావులు కదుపుతున్నారు. ముఖ్యంగా మండల పరిషత్, మున్సిపాలిటీ, జిల్లా పరిషత్ చైర్మన్ల పదవుల కోసం టికెట్లను ఆశించే ఆయా పార్టీల నేతలు తమ పార్టీ అధిష్టానాలతో లాబీయింగ్ తో పాటు మంతనాలు జరుపుతున్నారు. ఆయా పార్టీల మద్దతుతో ఎన్నికల బరిలో పోటీచేసే సర్పంచి పదవుల కోసం ఈ సారి పోటీ బాగానే ఉన్నట్టు తెలుస్తోంది. ముఖ్యంగా ప్రతిపక్ష పార్టీల కంటే అధికార పక్షంలోనే పోటీ ఎక్కువగా ఉంటుందని పలువురు భావిస్తున్నారు. సర్పంచుల పదవీకాలం ముగిసి ఏడాది, ఎంపీటీసీల పదవీకాలం ముగిసి ఆర్నెళ్లు, మున్సిపాలిటీల పదవీ కాలం గత నెల 26తో ముగియడంతో స్థానిక సమరానికి నాయకులు సన్నద్ధమౌతున్నారు. స్థానికంలోపోటీ చేయాలనుకున్న ఆయా పార్టీల ఆశావహుల సంఖ్య నానాటికి పెరిగిపోతోంది. ఈసారి జరిగే స్థానిక ఎన్నికలు రసవత్తరంగా మారనున్నాయని పలువురు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. పదేళ్ల కాలంపాటు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత వచ్చే తొలి ఎన్నికలు స్థానిక ఎన్నికలు కావడంతో ఈసారి జరిగే స్థానిక ఎన్నికలు చాలా ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఈ సారి స్థానిక ఎన్నికల్లో ప్రతిపక్ష బీఆర్‌ఎస్ పార్టీ కంటే అధికార పార్టీ కాంగ్రెస్‌లో నాయకుల్లో స్పర్ధ అధికంగా ఉండవచ్చనే ఊహాగానాలు వినవస్తున్నాయి. చాలా వరకు మున్సి పాలిటీలలో బీఆర్‌ఎస్‌కు చెందిన చైర్మన్లే ఉండడంతో తమ గెలుపు సునాయాసంఅనే భావనలో బీఆర్‌ఎస్ నేతలు, స్థానిక ప్రజాప్రతి నిధులు ఉన్నారు. ఇక అధికార పార్టీ కాంగ్రెస్ మాత్రం గత ఏడాది విజయాన్ని స్ఫూర్తిగా తీసుకుని అదే విజయ పరంపర ఈఏడాది జరిగే స్థానిక సంస్థలఎన్నికల్లో కొనసాగించాలనే ధీమాలోఉంది. ఏళ్ల తరబడి పార్టీనంటి పెట్టుకుని ఉంటూ జెండాలుమోసి రాష్ట్రంలోపార్టీని గెలిపించుకున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు స్థానిక ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా అధికార పార్టీ కాంగ్రెస్ గెలుపు గుర్రాల వేటలో ఉన్నట్లు తెలుస్తోంది. భూత్పూర్‌లో అందరి నజర్ ఎంపిపి, మున్సిపాలిటీల పైనే ఉంది.

**భూత్పూర్ మున్సిపాలిటీపైనే గురి :** గత నెలలో మున్సిపాలిటీ పాలకవర్గ పదవీకాలం ముగియడంతో త్వరలో జరిగే భూత్పూర్ బల్దియా ఎన్నికలకు ఆయా పార్టీలు తమ కసరత్తును ముమ్మరం చేశాయి. చైర్మన్‌గిరిపై అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు తమ గురిని నిలిపాయనేచెప్పాలి. మున్సిపాలిటీలోని పదిమంది కౌన్సిలర్లకుగాను ఏడు స్థానాల్లో బీఆర్‌ఎస్సే ఆధిపత్యం కొనసాగించింది. ప్రభుత్వం మారి కాంగ్రెస్ అధికార పగ్గాలు చేపట్టాక సమీకరణలు కూడా మారనున్న నేపథ్యంలో ఈ సారి మున్సిపల్ చైర్మన్ కోసం జరిగే ఎన్నికలు రసవత్తరంగా మారనున్నాయని చెప్పవచ్చు. అధికార పార్టీ కాంగ్రెస్ నుంచి ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్ మున్సిపాలిటీ చైర్మన్‌గిరిపై గురిపెట్టారు. గత ఎన్నికల్లో మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్ తరఫున వన్‌మ్యాన్‌ఆర్మీలా పనిచేసి పార్టీని గెలిపించడానికి శాయశక్తులా కృషిచేసి ఎమ్మెల్యే జీఎంఆర్‌తో పాటు కాంగ్రెస్ అధిష్టానంచే మంచిమార్కులు కొట్టారు. అన్ని వార్డుల్లో తన ప్రాభవాన్ని చాటుకునేందుకు ప్రతిచిన్న కార్యక్రమంలో పాల్గొంటూ పట్టణ ఓటరు నాడి తెల్సుకునే ప్రయత్నం చేస్తున్నారనే చెప్పాలి. ఇక ప్రతిపక్ష పార్టీ బీఆర్‌ఎస్ నుంచి పార్టీ సీనియర్ నాయకుడు టి మురళిధర్‌గౌడ్(టీఎంగౌడ్) మున్సిపల్ చైర్మన్‌బరిలో ఉన్నట్టు విశ్వసనీయ సమాచారం. టీఎంగౌడ్ గడిచిన పదేళ్ల పాటు ఏ పదవీ లేకుండా బీఆర్‌ఎస్‌కు ఎనలేని సేవచేస్తున్నారు. కరోనా, రిజర్వేషన్ల కారణంగా టిఎంగౌడ్ చైర్మన్ స్థానాన్ని వదులుకోవాల్సివచ్చింది. పార్టీలో ఇప్పుడున్న నేతల్లో టీఎంకు మంచిపేరుంది. పట్టణ ప్రజల ఆశీస్సులు, ఓటర్ల మద్దతు సంపూర్ణంగా ఉందని పలువురు భావిస్తున్నారు. లిక్కినవీన్‌గౌడ్(కాంగ్రెస్), టిమురళిధర్‌గౌడ్(బీఆర్‌ఎస్) వీరిద్దరిలో గెలుపొవరిదన్న అంశాన్ని రాబోయే అతిత్వరలో జరిగే మున్సిపల్‌ఎన్నికల్లో ఓటరు దేవుళ్లే తేల్చాలి. వీరితో పాటు జాతీయ పార్టీ బీజేపీ నుంచి ఐదిండ్ల శ్రీనుమున్సిపల్ చైర్మన్ బరిలో ఉన్నట్లు తెలుస్తోంది. అమిస్తాపూర్‌లోని 5,6,7,8వార్డుల్లో చాపకింద నీరులా శ్రీను అంతర్గత ప్రచారం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. మండల పరిషత్ అధ్యక్ష స్థానానికి గట్టిపోటి భూత్పూర్ మండల పరిషత్ అధ్యక్ష స్థానానికి అధికార పార్టీ కాంగ్రెస్ నుంచి సీనియర్ నాయకుడు, పోతులమడుగు మాజీ సర్పంచి హరియా నాయక్ ప్రధానంగా టికెట్‌ను ఆశిస్తుండగా, బీఆర్‌ఎస్ నుంచి కొత్త ముఖం ఆల బాలవర్ధన్‌రెడ్డి తనయుడు ఆల శ్రీకాంత్‌రెడ్డి ప్రధానంగా పోటీ పడుతున్నట్లు తెలుస్తోంది. మాజీ ఎమ్మెల్యే ఆల చొరవతో ఆల శ్రీకాంత్‌రెడ్డి, హరియా నాయక్ వీరిరువురికి ఆయా పార్టీల సంపూర్ణ మద్దతు, ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేల అండదండలు మెండుగా ఉన్నట్టు కూడా తెలుస్తోంది. భూత్పూర్ మండలంలో 16ఎంపీటీసీ స్థానాలుండగా, గతంలో సగానికి పైగా స్థానాలిన బీఆర్‌ఎస్ గెల్చుకుంది. గతంలో ఎంపిపిగా పనిచేసిన కదిరే శేఖర్‌రెడ్డి పార్టీని వీడి కాంగ్రెస్ కండువాకప్పు కోవడంతో ఈ సారిఎంపిపి ఎన్నికలు చాలా ఆసక్తికరంగా మారాయి. ఎంపిపి స్థానం జనరల్‌కు కేటాయిస్తే కాంగ్రెస్ నుంచి మళ్లీ కదిరేకే అవకాశం ఉండవచ్చనే ఊహాగానాలు వినవస్తున్నాయి. ఇదేజరిగితేకాంగ్రెస్‌నుంచి కదిరేశేఖర్‌రెడ్డికి, బీఆంఎస్ నుంచి ఆలశ్రీకాంత్‌రెడ్డి గట్టి పోటీ ఏర్పడనుంది. ఇక ఎంపిపి స్థానం ఎస్టీ రిజర్వేషన్ అయితే కాంగ్రెస్ నుంచి పార్టీ సీనియర్ నాయకుడుహరియానాయక్, బీఆర్‌ఎస్ నుంచి యువ నాయకుడు, మాజీ కౌన్సిలర్ బాలకోటి పోటీలో ఉండవచ్చనే అభిప్రాయం వ్యక్తమౌతోంది. జిల్లా పరిషత్ చైర్మన్ గిరిపై కేసిరెడ్డి గురి.. భూత్పూర్ మండలంలో కాంగ్రెస్‌కు ఏకైక వ్యక్తిగా పాటుపడుతున్న పార్టీ నాయకుడు మద్దిగట్ల కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి జిల్లా పరిషత్ చైర్మన్ పదవిని ఆశిస్తున్నారు. పార్టీలో కూడా ఈ అంశాన్ని నిక్కచ్చిగా చర్చిస్తున్నట్లు సమాచారం. గత ఎన్నికల్లో పార్టీని గెలిపించి గట్టెక్కించడంలో కేసీరెడ్డి భూత్పూర్ రూరల్‌లో తనదైన శైలిలో ప్రచారాన్ని నిర్వహించి కాంగ్రెస్‌ను విజయపథాన నడిపించేందుకు కృషిచేశారు. ఎమ్మెల్యేకు అతి సన్నిహితుడుగా మెలిగే కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డిని జిల్లా పరిషత్‌కు గెలిపించి జిల్లా పరిషత్ చైర్మన్ పదవీలో కూర్చోబెట్టేందుకు ఎమ్మెల్యే జీఎంఆర్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం సుముఖత వ్యక్తం చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఇందుకు తగ్గట్టుగానే కేసిరెడ్డి తనదైన శైలిలో గత ఎన్నికల్లో పార్టీ గెలుపునకు అవిరళ కృషిచేసి ఎమ్మెల్యే జీఎంఆర్‌కు అత్యంత సన్నిహితుడయ్యాడని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఎమ్మెల్యే తర్వాత ఆయనే మండలంలో గ్రేట్ లీడర్‌గా వెలుగొందుతూ ఆయా గ్రామాల ప్రజల్లో కేసిరెడ్డి చెరగని ముద్రని వేశారని చెప్పాలి. జిల్లా పరిషత్ చైర్మన్ పదవి కోసం కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అభ్యర్థిత్వం పార్టీలో ఇంచుమించు ఖరారైనట్లు కూడా విశ్వసనీయ సమాచారం.

# నేడు కల్యాణోత్సవం..

◆ ముస్తాబైన జడ్చర్ల వెంకటేశ్వర స్వామి ఆలయం
◆ రేపు రథోత్సవం.. ఎల్లుండి శకటోత్సవం
◆ ఏర్పాట్లు పూర్తిచేసిన ఆలయ నిర్వాహకులు

**జడ్చర్ల, ఫిబ్రవరి10 ప్రభాతవార్త:** జడ్చర్ల మున్సిపాలిటీ కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. నేటి ఉదయం 10:30 గం.లకు స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించేందుకు ఏర్పాటు చేశారు. ఈనెల 18 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు, ధర్మకర్తలు తెలిపారు. ఇప్పటికే ఆలయ ఆవరణలో పెద్ద ఎత్తున వ్యాపార సముదాయాలు, దుకాణాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమాలు.. 11న మంగళవారం ఉదయం 10:30 గంటలకు కళ్యాణోత్సవం, 12న రథోత్సవం, 13న శకటోత్సవం, 14న గరుడ వాహన సేవ, 15న గజవాహన సేవ, 16న శేష వాహన సేవ, 18న చక్రతీర్థ అమృత స్నానముతో బ్రహ్మోత్సవాలుముగియనున్నట్లు ప్రధాన అర్చకులు తెలిపారు. ఉత్సవాలకు సంబంధించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. బ్రహ్మోత్సవాలకు స్థానిక ఎమ్మెల్యేఅనిరుద్ రెడ్డితో పాటు మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణకు ఆహ్వానం పంపినట్లు నిర్వాహకులు తెలిపారు. కావున జడ్చర్లనియోజకవర్గంతో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్‌జిల్లా నుంచిపెద్ద ఎత్తున భక్తులు ఉత్సవాలకు హాజరై స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## నేడు కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

**కృష్ణ, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:** మండలానికి సంబంధించిన కల్యాణ లక్ష్మి షాదీ, ముబారక్ చెక్కులను నేడు స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పంపిణీ చేయనున్నట్లు మండల తాసిల్దార్ బి. వెంకటేష్ సోమవారం ప్రకటనలో తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఉదయం 10 గం.లకు నుంచి మండలానికి సంబంధించిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ మొత్తం 75 చెక్కులను ఆయా గ్రామాల లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హాజరవుతున్నట్లు ఆయన చేతుల మీదుగా చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. కావున మండల పరిధిలోని ఆయా గ్రామాల లబ్ధిదారులు హాజరై తమ చెక్కులను తీసుకోవాలని ఆయన కోరారు.

## ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

మొదటి పేజీ తరువాయి భాగం..

దేవస్థాన కమిటీ డైరెక్టర్లు సిరిసనగండ్ల సురేందర్ రావు, బొల్లె లక్ష్మయ్య, మార్కెట్ డైరెక్టర్ కృష్ణ, మామిళ్ళపల్లి ఆలయ కమిటీ డైరెక్టర్ గణేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**మొల్గరలో...** మండలంలోని మొల్గర గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు గ్రామ ప్రత్యేక అధికారి, ఇరిగేషన్ డిఇఇ బాలస్వామి, ఎంపిడిఓ మోహన్‌లాల్, పంచాయతీరాజ్ డిఇఇ చంద్రకళ, ఎఇ మహేష్, మండల నాయకులు కట్ట అనంతరెడ్డి, తిప్పర్తి నరసింహారెడ్డి, మాజీ జడ్పీటీసీ అనంత ప్రతాప్ రెడ్డి, నర్సింహారావు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు చింత గాళ్ళ శ్రీనివాసులు, బీసీ సెల్ మండలాధ్యక్షుడు మడ్డి తిరుపతయ్యగౌడ్, సూరం ప్రశాంత్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ శ్రీపురం పవన్ రెడ్డి, ఎస్సై వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## స్త్రీ నిధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

మొదటి పేజీ తరువాయి భాగం..

చేపల విక్రయ వాహ నంను కోయిల్ కొండకు చెందిన కర్నె కవిత, (భర్త శ్రీహరి) మంజూరు చేశారు. సోమవారం అట్టి సంచార చేపల విక్రయ వాహనంను లబ్దిదారులు కర్నె కవిత జిల్లా కలెక్టర్ కార్యాలయంనకు తీసుకొచ్చారు. కలెక్టర్ కార్యాలయ ఆవరణలో వాహనం రిజిస్ట్రేషన్ పేపర్లు లబ్దిదారులు కర్నె కవితకు జిల్లా కలెక్టర్ అందజేశారు. సంచార చేపల విక్రయవాహనం యొక్క వివరాలు, వారు వాహనంను ఎక్కడ, ఎలా ఉపయోగించుకుం టున్నారని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సబ్సిడిపై ఇచ్చిన ఇట్టి సంచా ర చేపల విక్రయ కేంద్రం సద్వినియోగంచేసుకొని ఆర్థికంగాఅభివృద్ధి చెందాలని సూచించారు. లబ్దిదారులు కవిత సబ్సిడీపై వాహనం లభిం చడంతో ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారిణిరాధరోహిణి, ఎల్‌డిఎంభాస్కర్ అన్నారు.

## ముడా నిధులతో అభివృద్ధి చేస్తాం

మొదటి పేజీ తరువాయి భాగం..

కంటికి రెప్పలా కాపాడే బొడ్రాయిని ఈ కాల నీలో అంగరంగ వైభవంగా ప్రతిష్టించుకోవడం సంతోషదాయకంగా ఉందని ఆయన అన్నారు. మంచి వాతావరణంలో ప్రతిష్టించుకొన్న ఈ ఆలయ ప్రాంగణంలో నిత్యం భక్తులతో కిటకిటలాడాలని, ఇక్కడ ప్రతిష్టించుకొన్న ఆంజనేయ స్వామి వారు భక్తుల కోరికలు తీర్చాలని, స్వామి దర్శనం చేసుకొంటే మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. ఈ దేవాలయం దేదీప్యమానంగా ఈ అభివృద్ధి చెందాలని, ఈ దేవాలయ అభివృద్ధి బాధ్యత నాది కూడా అని ఆయన అన్నారు. రాబోయే రోజుల్లో ఈ దేవాలయాన్ని అందరం కలిసి మరింత అద్భుతంగా అభివృద్ధి చేసుకుందామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో కోస్గి శివప్రసాద్ రెడ్డి, సురేందర్ రెడ్డి, చర్ల శ్రీనివాసులు, జే.చంద్రశేఖర్, మురళి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్ , మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.